
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 29.07.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 08 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

● చంద్రబాబు సెల్ఫ్‌గోల్ ● సొంత సర్వేలతో డిస్టింక్షన్ మార్కులు ● నేల విడిచి గాల్లో నడుస్తున్న ప్రభుత్వం



## వైఫల్యాల మోతకు...

# విజయాల పూత!

**2014** ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమనుకున్నారు. కాని వూహించని విధంగా తెలుగుదేశం అధికార పీఠమెక్కింది. దీనికి అనేక కారణాలున్నాయి. అయితే అందులో అతి ముఖ్యమైనవి జగన్‌కు సంబంధించిన 'సాక్షి' పత్రిక, సాక్షి ఛానెల్ కూడా! ఈ రెండు ఆ ఎన్నికల్లో జగన్‌కు మంచికంటే చెడే ఎక్కువ చేశాయి. సెల్ఫ్ సర్వేలతో అధికారం మనదేనంటూ ఊదరగొట్టాయి. అసెంబ్లీలో 125సీట్లు, లోక్‌సభలో 20సీట్లు తగ్గవని సొంత సర్వేలు నిర్వహించి చెబుతూ, జగన్‌ను గాల్లో నిలబెట్టాయి. ఈ సర్వేల మూలంగానే జగన్ ఆయా జిల్లాల్లో వున్న లోటుపాట్లను తెలుసుకోలేకపోయాడు.

అధికారం గ్యారంటీ అన్న ధీమాతో పార్టీలోకి వస్తామన్న కాంగ్రెస్ నాయకులను సైతం వద్దనేసారు. దీని మూలంగా ఎంత నష్టం జరిగిందన్నది ఆ తర్వాత ఫలితాలొచ్చాక తేటతెల్లమైంది. ఇప్పుడు చంద్రబాబు కూడా ఇదే మార్గంలో పయనిస్తున్నాడనిపిస్తోంది. పచ్చ మీడియా ఆయనను గాల్లో నిలుపుతోంది. ఆయన చేసే ప్రతి పనికి చెక్కభజన చేస్తున్నాయి. ప్రజా వ్యతిరేక విధానాలను సైతం అభివృద్ధి దిక్సూచిలంటూ ప్రచారం చేస్తున్నాయి. ఎన్నికలకు ముందు జగన్ విషయంలో సాక్షి మీడియా ఏ పాత్రయితే పోషించిందో, ఇప్పుడు చంద్రబాబు విషయంలోనూ పచ్చమీడియా అదే

(మిగతా 11వ పేజీలో)

# వైకాపా పాలకులకు గండం

- కడప, నెల్లూరు జడ్పీలే టార్గెట్
- కొత్త ఆర్డినెన్స్‌తో అవిశ్వాసానికి మార్గం

**చేతిలో** అధికారం ఉంటే ఎన్ని అడ్డదారులైనా తొక్కచ్చు. రాష్ట్రంలో చంద్రబాబు చేస్తున్నదిదే! అధికారాన్ని ఏ స్థాయిలో వాడుకోవాలో అంతకంటే ఎక్కువగానే వాడేస్తున్నాడు. ఎంతగా వాడేస్తున్నాడంటే... రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య స్ఫూర్తిని తుంగలో తొక్కేంతగా! (మిగతా 11వ పేజీలో)




## నిజాయితీలో 'ముత్యం'....

# పాలనలో రా'రాజు'

**నెల్లూరుజిల్లా 92వ కలెక్టర్‌గా రేవు ముత్యాలరాజు జూలై 25వ తేదీన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆఫీసుకు వచ్చేముందు తిరుమలలో శ్రీవారిని, నెల్లూరులో శ్రీ తల్పగిరి రంగనాథ స్వామిని దర్శించుకుని మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల తన నిబద్ధత చాటుకున్నారు.**

జిల్లా కలెక్టర్ కావడమన్నది చాలా గొప్ప కల. ఈ కల సాధించిన వారికంటే ఆ కలలు కన్నవారికి ఆ అనుభూతి చాలా ఆనందాన్నిస్తుంది. తనను ఉన్నత స్థానంలో చూడాలనుకుని తమ రెక్కల కష్టంతో తనను ఈ స్థానంలో నిలబెట్టిన తన తల్లిదండ్రులు శ్రీమతి చింతామణి, నరసింహమూర్తిలను ఆయన కలెక్టరేట్‌కు తీసుకొచ్చి, వారి ఆశీస్సులతో కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కన్నవారి కలను ఆయన ఈ విధంగా సాకారం చేసారు. ఇక జీవిత భాగస్వామిగా వున్న సతీమణి సింధూరి, తన ఆశల దీపం, కొడుకు చిన్నారిల సమక్షంలో ఆయన తొలిసారిగా కలెక్టర్ బాధ్యతలకు శ్రీకారం చుట్టారు.

ముత్యాలరాజు గొప్పింటి బిడ్డ కాదు, లక్షలు, కోట్లు పోసి కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిన వాడూ కాదు. కృష్ణా జిల్లాలోని మారుమూల లంక గ్రామం చిన్నగొల్లపాళెం ఆయన స్వగ్రామం. మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. సర్కార్ బళ్ళలోనే చదివాడు. 2004లో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో మొదటి ర్యాంకు సాధించిన ఆయన రైల్వే శాఖలో చేరారు. 2006లో సివిల్స్ వ్రాసి ఐపిఎస్ రాజస్థాన్ కేడర్‌కు ఎంపికయ్యారు. అయితే ఇక్కడితో సరిపెట్టుకోకుండా 2007లో మళ్ళీ సివిల్స్ వ్రాశారు. జాతీయ స్థాయిలో 1వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం 2008 నుండి కరీంనగర్ సహాయ కలెక్టర్‌గా, వికారాబాద్ సబ్‌కలెక్టర్‌గా, అదిలాబాద్ జిల్లాలోని ముట్నూరు ఐటిడిఏ పిఓగా, రంగారెడ్డి, (మిగతా 11వ పేజీలో)



# పోలీసు పోస్టులకు పచ్చజెండా!

పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఎట్టకేలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 22న భర్తీ చేయాలని నోటిఫికేషన్ విడుదల చేసింది. రెగ్యులర్ పోస్టులతో పాటు ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని పేర్కొంది. తాజా నోటిఫికేషన్‌లో 9 బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు సివిల్ విభాగంలో 246, ఏఆర్ విభాగంలో కేవలం 43 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. గతంలో కానిస్టేబుల్ పోస్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థి తొలుత 5కిలోమీటర్ల పరుగుపందెంలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఇతర పరీక్షలకు అర్హుడు. అయితే తాజా నోటిఫికేషన్‌లో 5కిలోమీటర్ల పరుగు పందెం రద్దు చేశారు. ఆ క్రమంలో తొలుత ప్రిలిమినరి పేరిట రాత పరీక్ష నిర్వహించి అందులో అర్హత సాధించిన వారికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. వాటిలో అర్హత సాధించిన వారికి రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా పోస్టులు భర్తీ చేయనున్నారు. ఆగస్టు 3వ తేదీ ఉదయం 10 నుంచి సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం 5గంటల లోపు కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు అభ్యర్థులు www.recruitment.appolice.gov.inలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పరిశీలించి అక్టోబర్ 16 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షకు 10రోజుల ముందుగానే వెబ్‌సైట్లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచుతారు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి దేహదారుఢ్య పరీక్ష, పరుగుపందెం, లాంగ్‌జంప్ తదితరాలు నిర్వహిస్తారు. 2016 జులై 1కి ఇంటర్ ఉత్తీర్ణులై, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులు.

# దళితులకు దన్నుగా నిలుస్తున్న 'దేశం'


## - ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి



నిరుపేద దళిత వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు రూ.1100కోట్లతో లక్షమంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టిందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల ఆర్థిక సంఘం ఛైర్మెన్ జూపూడి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో షెడ్యూల్డ్ కులాల లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో షెడ్యూల్డ్ కులాల వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వినూత్న రీతిలో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. షెడ్యూల్డు కులాల వారిని బలోపేతం చేసేందుకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో నిర్దేశించిన రుణాలను మంజూరు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన లక్షరూపాయలలో 60వేలు సబ్సిడీ పోగా మిగతా 40వేలు బ్యాంకు రుణం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో రూ.100కోట్లతో 5వేల మందికి రుణాలు మంజూరు చేసేందుకు లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది లక్షమంది ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఎస్సీలలో ఎక్కువమంది వ్యవసాయ కూలీలుగా ఉన్నారని, వారి కోసం భూమి కొనుగోలు పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాల రాజు మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ జరుగుతున్నట్లే, ప్రతి నెలకు ఒకసారి ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, వాకాటి నారాయణరెడ్డి, మాజీమంత్రులు మారెప్ప, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యంలు మాట్లాడారు. ఈ సందర్భంగా జూపూడికి ఘనసన్మానం చేశారు. అనంతరం రూ.30కోట్ల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్-2 ఆర్ఎస్ రాజ్‌కుమార్ అధ్యక్షత వహించారు. అదనపు ఎస్పీ శరత్ బాబు, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వర్ణా వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ఎస్సీ కార్పొరేషన్ ఇడి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం




## రెండో పంటకు నీరందిస్తాం

### - ఎస్ఇ కోటేశ్వరరావు

జిల్లాలో రెండో పంటకు నీరందిస్తామని, మొదట అనుకున్న విధంగా లక్షా 75వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యాన్ని అధిగమిస్తామని జలవనరుల శాఖ ఎస్ఇ కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ నెల 23న నీటిపారుదలశాఖ ఎస్ఇ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన నీటి సంఘాలవారితో సమావేశమై రెండవ పంటకు సాగునీరు విడుదల చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 12.5 టిఎంసిల నీరు వుందని, డెడ్‌స్టోరేజీ తగ్గకుండా పంటల సాగుకు నీటిని విడుదల చేస్తామన్నారు. పైతట్టు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున సోమశిలకు నీరు చేరే అవకాశం వుందని ఆయన తెలిపారు.



పాత కలెక్టర్‌కు కొత్త కలెక్టర్ జ్ఞాపిక



జానకితో మహిళా అధికారులు

## జానకి, ఐఏఎస్‌కు
# గౌరవప్రదంగా వీడ్కోలు

చూడగానే నమస్కరించాలనేంత సంస్కారం ఉట్టిపడే శ్రీమతి జానకి జూన్ 24వ తేదీన జిల్లా కలెక్టర్ బాధ్యతల నుండి రిలీవ్ అయ్యారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం. వెంకయ్యానాయుడు వ్యక్తిగత కార్యదర్శిగా ఆమెను నియమించడం తెలిసిందే! అలాగే ఆమె భర్త, విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌గా వుండిన యువరాజ్‌ను కూడా వెంకయ్యానాయుడు ఓఎస్‌డిగా నియమించారు. బదిలీ అయిన జానకిని 24, 25తేదీలలో జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లాలోని ప్రముఖులు కలిసి సత్కరించారు. కలెక్టర్‌గా ఆమె అందించిన సేవలను కొనియాడారు.



శ్రీమతి జానకికి వీడ్కోలు పలుకుతున్న జిల్లా ఉన్నతాధికారులు

# కలల యోధుడికి నెల్లూరు నివాళి



కలలు కనండి... ఆ కలలను సాకారం చేసుకోండంటూ యువతను తట్టి లేపిన మాజీ రాష్ట్రపతి భారతరత్న అబ్దుల్ కలాం ప్రథమ వర్ధంతి సందర్భంగా జులై 27వ తేదీన నెల్లూరులోని పలు ప్రాంతాల్లో, పలు కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలు, వైద్యశాలలు, స్వచ్ఛంధ సంస్థల కార్యాలయాలు, వివిధ పార్టీ కార్యాలయాల్లో కూడా ఆయన ప్రథమ వర్ధంతిని నిర్వహించడం విశేషం.

మహనీయుడు, అందరికీ ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం విగ్రహాన్ని నెల్లూరులో ఏర్పాటుచేసేందుకు పార్టీలకతీతంగా అందరం కలసి కృషి చేద్దామని, కలాం విగ్రహం ఏర్పాటుకు అందరూ ముందుకు రావాలని నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని రాజన్నభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ, విద్యార్థులు యువకులు యువశాస్త్రవేత్తలు, రాజకీయ నేతలు అందరూ అబ్దుల్‌కలాం ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అబ్దుల్‌కలాం విగ్రహం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపి కార్పొరేటర్లు, తాము కలసి కార్పొరేషన్ అధికారులను కోరుతామని, కలాం విగ్రహం ఏర్పాటయ్యేలా తగు కృషి చేస్తామన్నారు. తొలుత, అనిల్, తదితర కార్పొరేటర్లు అందరూ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సిద్దా రాఘవరావు పాల్గొని ఆ మహనీయుని స్మృతికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నగర పార్టీ అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహరావు, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆపండి... మీ నాటకాలు

## - కోటంరెడ్డిపై అజీజ్ ఫైర్

ఆపండి... మీ నాటకాలు.. బాధ్యత గల ఎమ్మెల్యేలమనే సంగతి మరచిపోయి నాటకాలు ఆడడం సిగ్గుచేటని... ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, సమయమొస్తే బుద్ధి చెబుతారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తీవ్రస్థాయిలో మండి పడ్డాడు. తెలుగుదేశం పార్టీ నగర అధ్య క్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి మంగళవారం నెల్లూరు టిడిపి జిల్లా కార్యా లయంలో విలేకర్లతో ఆయన మాట్లాడాడు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఇటీవల విలేకర్ల సమా వేశం ఏర్పాటు చేసి తనపైన, మంత్రి నారాయణపైన ఆరోపణలు చేస్తూ తమది అసమర్ధపాలన అని విమర్శించడంలో అర్థం లేదన్నారు. కోటంరెడ్డి తమతో కలిసి 50 అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్య క్రమాల్లో పాల్గొని టెంకాయలు కొట్టారని, అది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. మంత్రి నారాయణ చొరవతో రూ.200 కోట్లతో నగరంలోని ప్రతి వీధిలో ఏదో ఒక పని జరుగుతోందని, అది ఎమ్మెల్యే కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నిం చారు. ఇటీవల కార్పొరేషన్‌లో వేసిన టెండర్లలో సగభాగం 50శాతానికి పైగా లెస్‌కు వేసి పనులు మొదలు పెట్టలేదంటే దీని వెనుక ఎమ్మెల్యే హస్తం ఉన్నట్లు అర్థమవుతోందని ఆరోపించారు. హడ్కో రుణం రూ.1100కోట్లు నగర ప్రజలపై భారం వేస్తున్నారంటూ రూరల్ ఎమ్మెల్యేతో పాటు నగర ఎమ్మెల్యే కూడా అసత్య ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు.

టిడిపి నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు నెల్లూరుకు రాహుకేతువుల్లాగా దాపురించారని పేర్కొ న్నారు. వారు అభివృద్ధికి కలసిరారని, తాము అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేరని విమర్శించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరశింహారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండవ రామయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షంషుద్దీన్, కార్పొరేటర్లు చినపెంచలయ్య, సత్యనాగేశ్వరరావు, రాజానాయుడు, తురకా అనిత, శ్రీనివాసులునాయుడు, కె.బాలాజీ, జలదంకి సుధాకర్, రామ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా...
# సాయినాధుని నగరోత్సవం



నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీనగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సాయినాథుని నగరోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. విశేష పుష్పాలంకరణతో సర్వాలంకారశోభితంగా కొలువుదీరిన స్వామివారిని మంగళవాయిద్యాలతో, భజనలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, బాణాసంచా వేడుకల నడుమ నగరోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ నగరోత్సవం గాంధీబొమ్మ మీదుగా ఏసి సెంటర్, సంతపేట నాలుగుకాళ్ళ మండపం, చిన్నబజార్, పెద్దబజార్, బారకాసు, విఆర్‌సి సెంటర్ మీదుగా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చేరుకుని అక్కడి నుండి మందిరానికి చేరుకుంది.

**అన్నదానం:** గురుపూర్ణిమను మహోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు గాంధీబొమ్మ కూడలి సమీపంలో వున్న షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. దాదాపు మూడువేల మందికి అన్నదానం చేశారు. మందిరం నిర్వాహకులు మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి, పైడిపాటి సుధాకరరావు, కొల్లి శ్యామసుందర్‌రెడ్డి, దువ్వూరి జయమ్మ, మోహన్‌రావు తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

# స్వర్ణభారత్ సేవలు అభినందనీయం

విద్యార్థులతో ముచ్చటిస్తున్న కేంద్రమంత్రులు



గ్రామీణ ప్రజల అభ్యున్నతి కోసం స్వర్ణభారత్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమైనవని కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేష్‌ప్రభు కొనియాడారు. ఈ నెల 24న ఆయన వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌ను సందర్శించారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుతో కలిసి అక్కడ బ్రిడ్జి స్కూల్‌ను, అక్షర విద్యాలయాన్ని, రైతు శిక్షణ కేంద్రాన్ని, ఎల్వీప్రసాద్ నేత్రవైద్యశాల, మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రం వగైరా లను పరిశీలించారు. ఆయా కేంద్రాలు చేస్తున్న సామాజిక సేవలను ప్రశంసించారు. దేశ ఆర్థికవ్యవస్థ మెరుగుపడేందుకు ప్రతిచోటా ఇలా స్వర్ణభారత్ ట్రస్ట్ వంటి స్వచ్ఛంధసంస్థలు ఏర్పాటు కావాల్సివుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# దిద్దుబాటే... మేలు బాట!

**భరతమాతకు శిరఃస్థానంలో వున్న కశ్మీరం, అందచందాల లోయగా ప్రపంచవ్యాప్త ఖ్యాతిగాంచిన కశ్మీరం.. ఏనాటికీ వాడిపోవడానికి వీల్లేదు. కాశ్మీర్‌లో మళ్లీ చిరునవ్వుల పువ్వులు పూయాలి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నశించి..జాతీయభావాల గుభాళింపులతో మళ్లీ వికసిత సుగంధవనంలా కశ్మీరం పరిమళించాలి. అందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మనసులను గెలుచుకునేలా, అక్కడి యువతకు ఉపాధిని.. ప్రజలకు మంచిజీవితాలను అందించేందుకు చిత్తశుద్ధితో నిరంతర కృషి చేయాలి.**

కాశ్మీర్.. ఎంత అందాల లోయో!..పర్యాటకంగా ఎంతో కళకళలాడుతూ..మరెంతో అభివృద్ధి చెందాల్సిన ప్రాంతమో ఇది. కానీ, ఇప్పుడది అల్లర్లకు ఆటపట్టుగా మారింది. ఉగ్రవాద వర్గాలకు నెలవుగా తయారైంది. ఏళ్ళ తరబడిగా కొలిక్కిరాని జటిలమైన సమస్యలతో నేటికీ అట్టుడికిపోతోంది. ప్రజలు శాంతిపరులైనా, అక్కడంతా అల్లర్లకు పాల్పడే ఉగ్రవాదులదే రాజ్యమైపోయింది.

అసలే కాశ్మీర్ నిరుద్యోగలోయగా మారి వుంది. ఇక్కడున్న మూడింట రెండువంతుల జనాభా అంతా యువతే. ఇక్కడ అధికశాతంగా వున్న యువతకు ఎంతోకాలం నుంచి ఉపాధి కరువైపోయింది. సరైన ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత పడుతున్న అవస్తలు అంతాఇంతా కాదు. అటు చూస్తే అల్లరు, ఇటు చూస్తే కాల్పులు.. ఎటు వెళ్ళాలో తెలియక యువత తీవ్ర నిరాశా నిస్పృహలకు లోనై వుంది. ప్రజలంతా భీతావహ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఉగ్రవాదుల వీరంగాలతో లోయ అంతటా అశాంతి పెల్లుబుకుతుండగా, యువత బయటకు రాలేక ఇళ్ళలోనే వుండిపోవాల్సివస్తోంది.

ఈ నేపథ్యంలో ఇంటర్నెట్ ఒక్కటే వారికి ప్రత్యామ్నాయమైంది. అయితే, దీనిని కూడా బుర్హాన్‌వాని వంటి ఉగ్రవాదులు ఆయుధంగా వాడుకుని ఇంటర్నెట్‌లో ఉగ్ర సందేశాలు ఇవ్వడం ద్వారా అనేకమంది యువతకు, ప్రజలకు చేరువవుతున్నారు. మాయ మాటలతో ఉగ్రవాద భావజాలాన్నంతా నూరిపోస్తూ అమాయకులైన సామాన్యప్రజలను ఉగ్రవాద వర్గాలు ఆకట్టుకోగలుగుతున్నాయి. ఉగ్రవాది అయిన బుర్హాన్‌వానిని సైనికబలగాలు హతమార్చినప్పుడు కాశ్మీర్‌లోయలో అల్లర్లు చెలరేగాయంటే అందుకు ప్రధాన కారణం అక్కడంతా ఇలాంటి ఉగ్రోన్మాదానికి అనుకూల వాతావరణం కలిగివుండడమే. యువతను తప్పుదారి పట్టించే పాక్ ప్రేరేపిత ఉగ్రసందేశాలకు స్పందించిన యువత, ఉగ్రవాద అనుకూల వర్గాల దాడులతో, అల్లర్లతో కాశ్మీర్ ఇప్పుడింకా భగ్గుమంటూనే వుంది. ఆ ఉగ్రవాద భావజాలాన్నంతా సమూలంగా అరికట్టడమే ఇప్పుడు కేంద్రం తక్షణ కర్తవ్యం. దేశభద్రతకు, దేశ సమగ్రతకు, జాతీయతకు ముప్పుగా పరిణమిస్తున్న ఇలాంటి ప్రమాదకర ఉగ్ర భావజాలం వ్యాప్తి కాకుండా వెంటనే అడ్డుకోవాలి. సాంకేతికరంగంలోని నిపుణులు, అనుభవజ్ఞుల సాయంతో, క్షణం కూడా ఏమరుపాటు లేని నిరంతర పర్యవేక్షణతో ఉగ్రవాద భావజాలానికి ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేయాలి. ఉగ్రవాద నిర్మూలనకు యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణకు దిగితే తప్ప కాశ్మీర్‌లో పరిస్థితులు ఒక కొలిక్కి రావన్నది అందరికీ తెలిసిందే. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కాశ్మీర్‌లోయ నుంచి సమూలంగా పెకలించివేయాలి. కాశ్మీరును కబళించడానికి గుంటకాడ నక్కలా పొంచివున్న పాక్ ఆటలు చెల్లవని నిరూపించాలి. అందుకవసరమైన దిద్దుబాటు చర్యలన్నీ తీసుకోవాలి. అన్నివిధాలా దిద్దుబాటే మేలుబాటని గ్రహించాలి. ఉగ్రవాదం అనేది వాదమేమీ కాదని, అదో ఉన్మాద భావజాలమనీ, ఉగ్రవాదమంటే మానవత్వాన్ని పైశాచికంగా కబళించే భయంకర విషసర్పమనీ ప్రజలు, ముఖ్యంగా యువత గ్రహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రసార, ప్రచార మాధ్యమాలను అన్నిరకాల ప్రచారసాధనాలనూ ఉపయోగించి ప్రజలను మేల్కొలపాలి. జాతీయభావాలను ఉరకలెత్తించి ప్రజల్లో నూతన చైతన్యాన్ని ఆవిష్కరించగలగాలి. ఉపాధికోసం ఏవో ప్యాకేజీలు ప్రకటించి చేతులు దులుపుకోక, రాజకీయాలను పక్కనపెట్టి.. నిరాశా నిస్పృహల్లో వున్న నిరుద్యోగులకు, ప్రజలకు అండగా తామున్నామంటూ భరోసా ఇచ్చి, వారికి అవసరమైన ఉపాధిని కల్పించేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన ప్రణాళికలతో రంగంలోకి దిగాలి. మంచి వాతావరణం, మంచి ఉద్యోగం..మంచి జీవితాల కోసం ఎదురుచూస్తున్న యువతకు..ప్రజలకు మనోధైర్యం కల్పించి వారి ఆశలు ఆకాంక్షలు ఫలించేందుకు ప్రభుత్వాలు కంకణం కట్టుకోవాలి. తద్వారా కశ్మీరీ ప్రజల మనసులను గెలుచుకోవాలి. కాశ్మీర్ సమస్యలనొక సవాల్‌గా తీసుకుని పరిష్కరించాలి. అది కేవలం కాశ్మీర్ సమస్య అని కాక, జాతీయతకే సవాల్‌గా పరిణమిస్తున్న ఆ సమస్యను విజ్ఞతతో, శాంతియుతంగా శాశ్వత ప్రాతిపదికపై పరిష్కరించగలగాలి. కశ్మీరీ ప్రజల అన్ని రకాల సమస్యలనూ పరిశీలించి పరిష్కరించినప్పుడే అక్కడి ప్రజలకు ప్రభుత్వంపై భరోసా ఏర్పడుతుంది. ఇక్కడ సైనికబలగాలున్నది ప్రజల కోసమేననే స్పష్టమైన భావన ప్రజల్లో కలిగేలా కృషి చేయాలి. తద్వారా ప్రజల్లో నూతన చైతన్యాన్ని పాదుకొల్పేందుకు సర్వత్రా కృషి చేయాలి.

ఎల్లెడలా దేశభక్తి వెల్లివిరిసినప్పుడు.. జాతీయతా భావం పెల్లుబికినప్పుడు దేశప్రగతిబాటలో తామూ మమేకం కావాలనే బృహత్తరమైన ఆశయాన్ని కలిగి వున్నప్పుడు కాశ్మీర్‌లోనే కాదు..ఎక్కడైనా సరే శాంతి పల్లవిస్తుంది.. ప్రగతి వెల్లువెత్తుతుంది. ఇప్పటికే అక్కడవున్న సైనిక బలగాలు నిరంతరం ఉగ్రవాదుల కట్టడికి కంటికి కునుకులేకుండా కష్టపడుతూనే వున్నాయి. తమ ప్రాణాలను సైతం లెక్కచేయక ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు అనుక్షణం తపిస్తూనే వున్నాయి. ఇటీవల అమర్‌నాథ్ యాత్రకు వెళ్ళిన వేలాది మంది యాత్రికులను సైతం అంతటి అల్లర్లలోనూ కాపాడి సురక్షితంగా వారివారి ప్రాంతాలకు పంపిన మన ధీరజవాన్ల దేశభక్తికి శతకోటి ప్రణామాలు. ఏదేమైనా సరే..భరతమాతకు శిరస్థానంలో వున్న కశ్మీరం, అందచందాల లోయగా ప్రపంచవ్యాప్త ఖ్యాతిగాంచిన కశ్మీరం.. ఏనాటికీ వాడిపోవడానికి వీల్లేదు. కాశ్మీర్‌లో మళ్ళీ చిరునవ్వుల పువ్వులు పూయాలి. ఉగ్రవాదం నశించి జాతీయభావాల గుభాళింపులతో మళ్ళీ వికసిత సుగంధపుష్పంలా కశ్మీరం పరిమళించాలి. ప్రజలంతా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గళమెత్తి..జాతీయతాభావాన్ని నిండుగుండెలతో ఆహ్వానించాలి. ప్రభుత్వం-ప్రజలంతా ఒక్కటై శాంతిని-సామరస్యాన్ని పరిరక్షించుకోవాలి. ఆ మేరకు ప్రజలను, యువతను చైతన్యవంతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతర కృషిచేయాలి. ప్రజాప్రతినిధులూ.. ప్రజలు అందరూ అందుకు సహకరించాలి. అప్పుడే కాశ్మీర్‌కు పునర్వైభవం.

# అయోడిన్ సాల్ట్ వాడాలి

**- జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్**



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఇంతియాజ్

అయోడిన్ సాల్ట్ వాడే విధంగా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని నెల్లూరు జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 23వతేదీ తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ అయోడైజ్డ్ సాల్ట్ వినియోగించకపోతే థైరాయిడ్, గాయిటర్ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ సెంటర్లలో అయోడిన్ సాల్ట్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 19 సాల్ట్ శాంపిల్స్‌ను పరీక్షించామని, అందులో 7 శాంపిల్స్‌లో అయోడిన్ తగినంత మోతాదులో లేదని, అలాంటి ఉప్పు విక్రయిస్తున్న వారికి జరిమానా విధించినట్లు తెలిపారు. సమావేశంలో గెజిటెడ్ ఫుడ్ ఇన్స్‌పెక్టర్ వి.ఆనందరావు, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

# బ్లడ్‌బ్యాంక్‌లో సింగిల్ డోనార్ ప్లేట్‌మిషన్

నెల్లూరు బ్లడ్‌బ్యాంక్‌లో 23వ తేదీ అధునాతనమైన సింగిల్ డోనార్ ప్లేట్‌మిషన్ (ఎస్‌డిపి)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్లడ్‌బ్యాంక్ ఛైర్మెన్ బియస్ ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ తాము బొథ్రన్స్ హోమ్స్ ఎన్‌జివో ఆధ్వర్యంలో బ్యాంక్‌ను ప్రారంభించామన్నారు. ఇది ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వం నిర్ణయించిన తక్కువ ధరలతోనే రోగులకు రక్తం అందిస్తున్నామన్నారు. సాధారణంగా రోగులకు ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తే 2వేల నుంచి 4వేల వరకు రక్తకణాలు పెరుగుతాయని, తాము ప్రవేశపెట్టిన ఎస్‌డిపి యంత్రంతో ఒకేసారి 50వేలకుపైగా రోగికి రక్తకణాలు పెరుగుతాయన్నారు. జిల్లాలో రక్తం కొరత తీర్చేందుకు మాత్రమే బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసామన్నారు. బ్లడ్‌బ్యాంక్ జిల్లా కో-ఆర్డినేటర్ మోపూరు భాస్కర్‌నాయుడు, డాక్టర్లు పెంచలప్రసాద్, సాయినాథ్, భార్గవ హెల్త్‌కేర్ సిఇఓ చంద్రశేఖర్‌రెడ్డి, స్వచ్ఛంధ సంస్థల అధ్యక్షుడు ఇవిఎస్ నాయుడు, మైత్రీ ఫౌండేషన్ ఛైర్మెన్ సుధాకర్ పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు సిమ్స్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.సునీల్‌కుమార్ ఇటీవల ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), జాతీయ జీవనోపాధుల సంస్థ(ఎన్‌యూఎల్‌ఎం) నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో 18 నుండి 35ఏళ్లలోపు గల 10వ తరగతి పైన చదివిన నిరుద్యోగులకు శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 7799077366 నెంబరులో సంప్రదించాలని కోరారు.

# ఉపకార వేతనాలకు దరఖాస్తులు

2016-17 విద్యా సంవత్సరానికిగాను ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు అబ్దుస్ సుబహాన్ ఇటీవల ఓ ప్రకటనలో తెలిపారు. పిజి, డిప్లొమా కోర్సులు చదివే విద్యార్థులు ఆగస్టు 31లోగా www.popularfrontindia.org నుంచి దరఖాస్తులను డౌన్‌లోడు చేసుకుని పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు.




# నెహ్రూ విధానాలతోనే చేటు

భారత దేశానికి నెహ్రూ తొలిప్రధాని కావడం మన దౌర్భాగ్యం. ఆయన చేతకాని విధానాల వల్లే కాశ్మీర్ సమస్య ఇప్పటికీ మండుతోంది. 500పై చిలుకు సంస్థానాలను సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ భారత్‌లో విలీనం చేస్తే, ఈరోజు ఒక్క దాంట్లోనూ సమస్య లేదు. ఆఖరకు నిజాం ఏలుబడిలో వున్న హైదరాబాద్ సంస్థానాన్ని కూడా పటేల్ సైనిక చర్యలతో విలీనం చేశాడు. అక్కడ కూడా సమస్య లేదు. హిందూ రాజు ఏలుబడిలో వున్న కాశ్మీర్‌ను నెహ్రూకు అప్పగించారు. అతని స్వార్థం మూలంగా దేశంలో ఏ సంస్థానానికి కల్పించని ప్రత్యేక హక్కులు, అధికారాలు కాశ్మీర్‌కు కల్పించారు. అవే ఈరోజు సమస్యను పెద్దవి చేస్తున్నాయి. పాక్ ప్రేరణతో రెచ్చిపోతున్న కాశ్మీరీ వేర్పాటువాదులపై కఠినచర్యలు తీసుకుంటేగాని దారికి రారు.

**- పోలు సుబ్బారెడ్డి, పొదలకూరు.**

## ప్రచారార్భాటాలు వద్దు

క్రితంసారి గోదావరి పుష్కరాలకు మహాపుష్కరాల పేరుతో ప్రచారం దంచేసారు. ఈ పుష్కరాలకు గోదావరిలో మునగకపోతే నేరుగా నరకానికే పోతారన్నట్లు ప్రభుత్వమే వాటిని మహాపుష్కరాలంటూ ప్రచారం చేసేసింది. తొలిరోజు తొక్కిసలాటలోనే 27మంది చనిపోవడం తెలిసిందే! ఇక జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగి గంటలకొద్ది ఆగిపోయి ప్రజలు అవస్థలు పడ్డారు. కృష్ణాపుష్కరాలకు కూడా అదే తప్పు చేస్తున్నారు. అంతే ప్రచారం దట్టిస్తున్నారు. పుష్కరాలు ఒక భక్తి కార్యక్రమంలా కాకుండా ప్రభుత్వ ప్రచార కార్యక్రమంలా తయారయ్యాయి.

**కె.శ్రీనివాసాచారి, నెల్లూరు.**

## అర్హులకే అవార్డులివ్వాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిస్తున్న ప్రతిష్ఠాత్మక అవార్డులు సైతం ఇటీవల కమర్షియల్‌గా మారుతున్నాయి. దేశానికి, సమాజానికి ఏ మాత్రం సేవ చేయనివారికి కూడా అత్యున్నత పురస్కారాలు అందజేస్తున్నారు. క్రీడల్లో, సినిమాలలో కోట్లు కూడబెట్టిన వారికి కూడా దేశ అత్యున్నత పురస్కారాలు అందజేస్తుండడం విచారకరం. దేశానికి తిండిపెట్టే రైతులను, శ్రామికులను ఈ అవార్డుల ఎంపికలో పరిగణనలోకి తీసుకోవాలి.

**ఎన్.రమణయ్య, నెల్లూరు.**

# నెల్లూరు నెత్తిన 'అణు'కుంపటి

***కొత్తగా వచ్చే పరిశ్రమలతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలి. ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు ఏర్పడాలి. స్థానికంగా భూముల ధరలు పెరగాలి. రైతుల బ్రతుకులు బాగుపడాలి. వ్యాపారాలు మెరుగుపడాలి. మౌలిక సదుపాయాలు ఏర్పడాలి. స్థూలంగా ఉత్పాదకత, అభివృద్ధి రేటు పెరగాలి. ప్రజలు కోరుకునేది ఇలాంటి పారిశ్రామిక ప్రగతినే! అంతేగాని తమ బ్రతుకులను పణంగా పెట్టే పారిశ్రామికీకరణను కాదు.***

చంద్రబాబు పాలనలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. రాజధాని పేరుతో మూడు పంటలు పండే బంగారుభూములను నాశనం చేస్తున్నారు. పారిశ్రామికీకరణ పేరుతో ప్రజల ప్రాణాలతో ఫుట్‌బాల్ ఆడుతున్నారు. అవును... ఇది నిజమే! రష్యా పర్యటనలో నేను ఎంతో వెలగబెట్టానని చెప్పుకుంటున్న చంద్రబాబు చివరకు చేసిందేమిటంటే రష్యా సహకారంతో ఒక అణుబాంబును తెచ్చి నెల్లూరుజిల్లా మీద వేయబోతున్నాడు. అదే... నెల్లూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దులో కావలి సమీపంలోని చెన్నాయపాళెం, రుద్రకోట వద్ద అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈమేరకు భూసేకరణ కూడా జరపమని జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారని,



అధికారులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారని కూడా సమాచారం. 2014 ఎన్నికలప్పటి నుండి చంద్రబాబుకు నెల్లూరుజిల్లా మాట వింటేనే పుండు మీద కారం చల్లినట్లుగా వుంటుంది. దానికి కారణం ఆ ఎన్నికల్లో ఈ జిల్లా నుండి తెలుగుదేశం పార్టీకి తక్కువ సీట్లు రావడమే! ఈ అలకతోనే ఆయన నెల్లూరుజిల్లా అభివృద్ధి కొరకు ఏ పనులూ అడగొద్దంటూ జిల్లా నేతలకు ముందుగానే చెప్పేసాడు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జాతీయ విద్య, వైద్య సంస్థలను జిల్లాకొకటి లెక్కన కేటాయించినా, నెల్లూరుజిల్లాకు మాత్రం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇవ్వలేదు. నెల్లూరుజిల్లా మీద ఆయనకు ఆ కోపం ఇంకా తగ్గినట్లు లేదు. ఇప్పుడు కావలి వద్ద అణువిద్యుత్ కేంద్రం పెట్టించాలని చూస్తున్నాడు.

నెల్లూరుజిల్లా తీరప్రాంతంలో ఇప్పటికే 15వేల మెగావాట్ల విద్యుత్ కేంద్రాలున్నాయి. వీటి నుండి వెలువడే కాలుష్యమే నెల్లూరు నగర శివార్ల దాకా వస్తుంది. ఇవన్నా థర్మల్ విద్యుత్ కేంద్రాలు. ప్రమాదం స్థాయి తక్కువగా ఉంటుంది. అణువిద్యుత్ కేంద్రంతో ప్రమాదం ఏ లెవల్లో ఉంటుందో చెప్పలేము. స్థానికంగా గాలి, నీరు కలుషితమవుతాయి. ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలయ్యే అవకాశముంది. అణువిద్యుత్ కేంద్రాలలో అనుకోని ప్రమాదాలు సంభవిస్తే దాని తీవ్రత 200 కిలోమీటర్ల దాకా ఉంటుంది. ప్రాణ నష్టం కూడా అధికంగానే ఉంటుంది.

ఇంతటి ప్రమాదం వుంది కాబట్టే రష్యా ప్రతిపాదిత అణువిద్యుత్ కేంద్రాన్ని తమ రాష్ట్రాలలో నెలకొల్పడానికి తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, గుజరాత్ వంటి రాష్ట్రాలు ఒప్పుకోలేదు. తమిళనాడులోని కూడంకుళం, మన రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాలోని కొవ్వాడ వద్ద అణు విద్యుత్ కేంద్రాలను నిరసిస్తూ భారీఎత్తున ప్రజాందోళనలు నిర్వహించడం తెలిసిందే! ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే అణువిద్యుత్ కేంద్రాల ఏర్పాటుపై జిల్లా ప్రజలు అప్రమత్తం కావాల్సిన అవసరముంది.

## ఉన్నట్టా? లేనట్టా?

### • 'నుడా'పై మళ్ళీ మొలకెత్తిన ఆశలు



నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా)... తెలుగుదేశం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇది ఊరిస్తూనే వుంది. అదిగో ఇదిగో అంటూ ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచాయి. 'నుడా' ఏర్పాటు ప్రతిపాదనలు నానుతూనే వున్నాయి. మొదట 36మండలాలను కలిపి 'నుడా' ఏర్పాటు చేయాలనుకున్నారు. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలలోని 10మండలాలను పక్కన పెట్టేసి మిగతా జిల్లానంతా 'నుడా' పరిధిలోకి తెచ్చే విధంగా ప్రతిపాదనలు తయారు చేశారు. తద్వారా ఆ ప్రతిపాదనలను అటకెక్కించారు. 'నుడా' ఛైర్మెన్ పదవిపై గంపెడాశలు పెంచుకున్న తెలుగుదేశం నాయకులు ఇది వచ్చేది లేదు, సచ్చేది లేదు అని సరిపెట్టుకున్నారు.

కాగా 'నుడా'పై మళ్లీ ఆశలు చిగురించాయి. ఆగస్టు రెండోవారంలో జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో 'నుడా' ఏర్పాటు ఫైల్‌ను పెట్టబోతున్నారు. ఈమేరకు 'నుడా' ప్రతిపాదనతో కూడిన ఫైలును కేబినెట్ భేటీలో పెట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వం నుండి మున్సిపల్ శాఖకు ఆదేశాలు వచ్చాయి. దీంతో అధికారులు జిల్లాలోని 19మండలాలలను కలిపి నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రూపకల్పన చేసారని తెలుస్తోంది. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు, కావలి, గూడూరు, సూళ్లూరుపేట మున్సిపాల్టీలను, నాయుడుపేట నగర పంచాయితీని 'నుడా' పరిధిలోకి తేనున్నారు. కావలి నుండి తడ దాకా జాతీయ రహదారి వెంబడి పారిశ్రామికాభివృద్ధికి అవకాశం వున్న అన్ని మండలాలు 'నుడా' పరిధిలోకి వస్తాయి. మొత్తం 1569 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో 13లక్షల జనాభాతో 'నుడా' ఫైల్ తుది మెరుగులు దిద్దుకుంది. ఆగస్టులో జరిగే కేబినెట్ మీటింగ్‌లో దీనిపై స్టాంప్ పడితే, ఆ తర్వాత జిల్లా నాయకుల మధ్య 'నుడా' ఛైర్మెన్ పదవికై రన్నింగ్‌రేస్ మొదలవుతుంది.

## పిఎంఓ దృష్టికి 'సేవ్ నెల్లూరు'



యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా పట్టుదలతో ప్రారంభించిన 'సేవ్ నెల్లూరు' కార్యక్రమం విజయవంతంగా నడుస్తుండడం చూస్తున్నాం. తన ఉద్యమాన్ని సోషల్ మీడియాకే పరిమితం కాకుండా నెల్లూరులోని ప్రతి గడప గడప ఎక్కి 1136 కోట్ల హడ్కో అప్పుతో నెల్లూరు ప్రజల మీద పడే భారాన్ని కరపత్రాల రూపంలో వివరిస్తున్నాడు. కాంగ్రెస్‌పార్టీ నాయకుడైనప్పటికి వినోద్‌రెడ్డి ఆ పార్టీతో సంబంధం లేకుండా, ఆ పార్టీ నాయకుల భాగస్వామ్యం లేకుండా తానొక్కడే ఈ కార్యక్రమాన్ని ముందుకు నడిపిస్తున్నాడు. హడ్కో నిధులతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ వల్లే నగరంలో తలెత్తే గబ్బును, ప్రజలపై పడే పన్నుల భారాన్ని ప్రజలకు అర్ధమయ్యేలానే వివరిస్తున్నాడు. సోషల్ మీడియాలో పెద్దఎత్తున జరుగుతున్న 'సేవ్ నెల్లూరు' ఉద్యమం ప్రధాని కార్యాలయందాకా వెళ్లింది. దీనిపై పిఎంఓ ప్రత్యేక దృష్టి పెట్టి విచారిస్తున్నట్లు తెలిసింది. హడ్కో నిధులతో జరిగే ఈ తంతును ఆపితే వినోద్‌రెడ్డి సక్సెస్ అయినట్లే!

### • రంగంలోకి ఎమ్మెల్సీ

## 'రేస్'గుర్రాలు



మరో ఆరునెలల్లో జిల్లా నుండి ఇంకో ఎమ్మెల్సీ ఎన్నికకు అవకాశం రాబోతోంది. నెల్లూరుజిల్లా స్థానిక శాసనమండలి నియోజకవర్గంకు ఎన్నికలు జరుగనున్నాయి. ఆ నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా వున్న వాకాటి నారాయణరెడ్డి పదవీ కాలం పూర్తి కాబోతోంది. ఈ నేపథ్యంలో ఈసారి కొత్త అభ్యర్థి ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది.

క్రితంసారి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వాకాటి నారాయణరెడ్డి, వైకాపా అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, తెలుగుదేశం అభ్యర్థిగా బీద రవిచంద్ర మధ్య ముక్కోణపు పోరు జరుగగా, స్వల్ప తేడాతో వాకాటి నారాయణరెడ్డి గెలుపొందడం తెలిసిందే! ఆరోజు వాకాటి గెలుపు కోసం భారీఎత్తున క్యాంప్‌లు నిర్వహించాల్సి వచ్చింది. ముగ్గురు అభ్యర్థులు కూడా భారీగానే ఖర్చు పెట్టారు. ఒక్కో ఓటు విలువ మూడు లక్షలు దాకా పలికినట్లు సమాచారం. అయితే ఆరోజు పరిస్థితి ఏంటంటే మూడు పార్టీల మధ్య పోటీ నువ్వా-నేనా అన్నట్లు జరిగింది.

రేపు మాత్రం ఆ పరిస్థితి లేదు. జిల్లా రాజకీయాలను శాసించే బాద్‌షాలెవరూ లేకపోయినా 'వార్ వన్‌సైడే' కానుంది. తెలుగుదేశంపార్టీ టిక్కెట్‌ను ఎవరు తెచ్చుకుంటే వారు ఎమ్మెల్సీ కావడం ఖాయం. వైకాపా అభ్యర్థిని నిలబెట్టదు. ఒకవేళ నిలబెట్టినా డబ్బులు కుమ్మరించేంత పని చేయదు. స్థానిక శాసనమండలి నియోజకవర్గంలో కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు ఓటర్లుగా ఉంటారు. 2014ఎన్నికల తర్వాత జిల్లాలో వైకాపాకే మెజార్టీ ఉన్నప్పటికీ, తదనంతర పరిణామాలలో తెలుగుదేశంపార్టీ అధికారంలో వున్నందున చాలామంది స్థానిక సంస్థల ప్రతినిధులు వైకాపాను వదిలి తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! దీంతో స్థానిక సంస్థల శాసనమండలిలో తెలుగుదేశంను అడ్డుకునే పరిస్థితి లేదు.

ఇంత సులభంగా ఉంది కాబట్టే జిల్లాలోని అధికారపార్టీ నాయకులు ఈ ఎమ్మెల్సీ ప్రయత్నాలను అప్పుడే మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల రాజ్యసభను ఆశించి నిరాశకు గురైన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ సీటుపై కన్నేశాడని సమాచారం. ఇక ఇప్పటిప్పట్లో రాజ్యసభ వచ్చే అవకాశాలు లేకపోవడంతో ఆయన దీనిపై దృష్టి పెట్టాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా వున్న వాకాటి నారాయణరెడ్డి కూడా మళ్ళీ రెండోసారి కోసం ప్రయత్నించనున్నట్లు సమాచారం. 2014ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో వున్న ఆయన తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! ఆయన కూడా తన ప్రయత్నాల్లో తానున్నాడు. 2014 ఎన్నికల్లో కోవూరు సీటును ఆశించి చివరి నిముషంలో మిస్ అయిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి పేరు కూడా ఎమ్మెల్సీ రేస్‌లో వుంది.

జిల్లాలో వున్న ఎమ్మెల్యేలు ముగ్గురూ తూర్పు ప్రాంతం వాళ్లే! మెట్టప్రాంతం వైపున ఒకరికన్నా ప్రాధాన్యత కల్పించాలనుకుంటే అందుకు అనువైన వ్యక్తి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి. గత మూడేళ్లలో బ్యాంకు అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తూ రాజకీయాలలో వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్న మెట్టుకూరును కూడా ఆ టైంకు పరిశీలించే అవకాశాలు లేకుండా పోలేదు. పోటీ చేస్తే గెలుపు గ్యారంటీ వున్న ఈ సీటు కోసం పార్టీ నేతల మధ్యే గట్టి పోటీ ఖాయం.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





బాధ్యతలకు ముందు...

## రంగనాథుడిని దర్శించుకుని...

ఈ నెల 25వ తేదీన నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందుగా ముత్యాలరాజు శ్రీ తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకున్నారు. సతీసమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు స్వాగతం పలికారు. ఆలయంలో ప్రదక్షిణలు చేసి, స్వామికి పూజలు నిర్వ హించిన అనంతరం ఆయన కలెక్టరేట్‌కు వెళ్లారు.

## విజయవాడకు నెల్లూరు పోలీస్

కృష్ణ పుష్కరాల బందోబస్తు నేపథ్యంలో జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ, ఏఎస్పీ, 9మంది డిఎస్పీలు 26వ తేదీ విజయవాడకు వెళ్లారు. కృష్ణా పుష్కరాలలో ఎస్పీ విశాల్‌గున్నీకి కమాండెంట్ అండ్ కంట్రోల్ బాధ్యతలు అప్పగించారు.

## నగరంలో నందనవనం

నెల్లూరు శివార్లలోని ఆమంచర్ల వద్ద 145హెక్టార్ల విస్తీర్ణంలో అటవీశాఖ ఆధ్వర్యంలో 'నగరవనం' ముస్తాబవుతోంది. ఈ వనానికి కేంద్రం 70లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం 55లక్షల నిధులను మంజూరు చేశాయి. ఇప్పటివరకు కాంపౌండ్‌వాల్, వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఇప్పుడు విడుదలైన నిధులతో ఉద్యానవనాల అభివృద్ధి, వాటర్ ట్యాంకులు, ఫౌంటేన్‌లు, యోగా కేంద్రం వంటివి ఏర్పాటు చేయనున్నారు. 2017కల్లా నెల్లూరు ప్రజలకు ఈ నందనవనాన్ని కానుకగా అందించాలన్న లక్ష్యంతో అధికారులు పని చేస్తున్నారు.

## జడ్పీలో బొమ్మిరెడ్డి బర్త్‌డే



ఈ నెల 24న నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి జన్మదిన వేడుకలను బాగానే జరిపారు. జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి, అకౌంట్స్ అధికారి వసుమతి, పంచాయితీ రాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు పెంచలయ్య, భీమిరెడ్డి, రమేష్‌రెడ్డి, ముజీబ్‌ల ఆధ్వర్యంలో ఉద్యోగులు వేర్వేరుగా వచ్చి రాఘవకు పూలబొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాలకు చెందిన ఆయన అనుచరులు, వైకాపా కార్యకర్తలు నెల్లూరు, దర్గామిట్టలోని ఆయన అతిథిగృహం వద్దకు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్ నేతలకు పని పెట్టారు





జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఖాళీగా లేకుండా పార్టీ అధిష్టానం పని పెట్టింది. మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మిని పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. పిసిసి ప్రధాన కార్యదర్శి పి.చెంచలబాబుయాదవ్‌ను కడపజిల్లా త్రిసభ్య కమిటీ ఇన్‌ఛార్జ్‌గా, పిసిసి ఉపాధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డిని ప్రకాశం జిల్లా త్రిసభ్య కమిటీ సభ్యుడిగా నియమించారు. నాయకులను ఖాళీగా పెడితే పక్కపార్టీల వైపు చూస్తారనేమో... పక్క జిల్లాల్లో పని పెట్టారు.

## ముత్యాలరాజుకు బంగారు అక్షరాలతో స్వాగతం



నెల్లూరుజిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రేవు ముత్యాలరాజుకు స్వాగతం పలికేందుకు సూక్ష్మ బంగారు నమూనాను తయారు చేశారు నెల్లూరుకు చెందిన సూక్ష్మ నమూనాల సృష్టికర్త డా॥ షేక్ ముసవ్వీర్. కలెక్టర్ ముత్యాలరాజు అనే అక్షరాలను బంగారంతో రూపొందించి ఆయన కంటిలోపుంచి ప్రదర్శించారు. కేవలం 200మి.గ్రాల బంగారంతో ఒక సెం.మీ ఎత్తు, అర సెం.మీ వెడల్పుతో పేరుకు రెండువైపులా జాతీయ జెండాలతో అలంకరించారు.

పురపాలక సలహాదారుగా

## నన్నేసాహెబ్

నెల్లూరు నగరపాలక సంస్థ న్యాయ సలహాదారుడిగా న్యాయవాది నన్నే సాహెబ్‌ను నియమిస్తూ కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన స్టాండింగ్ కమిటీలో నన్నేసాహెబ్ ప్రతిపాదనను సభ్యుడు కిన్నెర ప్రసాద్ వ్యతిరేకించడం తెలిసిందే! ఎవరినడిగి ఈ నియామకం చేశారని ఆయన ప్రశ్నించారు. అయితే మిగతా సభ్యుల ఆమోదంతో నన్నే సాహెబ్‌ను నియమించారు.

బాధ్యతలు తీసుకున్న

## బాల సుందరం

నెల్లూరు సిసిఎస్ డిఎస్పీగా ఎం.బాల సుందరం ఈ నెల 25న బాధ్యతలు చేపట్టారు. గుంటూరుజిల్లాకు చెందిన బాలసుందరం 1995లో ఎస్ఐగా పోలీసు శాఖలో విధులు మొదలుపెట్టారు. ప్రకాశం జిల్లాలో ఎస్ఐగా ఎక్కువకాలం పని చేశారు. 2009లో సిఐగా పదోన్నతి పొంది గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు నెల్లూరులో సిసిఎస్ సిఐగా కూడా పనిచేశారు. 2014లో డిఎస్పీ అయ్యారు. ప్రకాశం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగంలో పని చేస్తూ, బదిలీ మీద నెల్లూరొచ్చారు.

టౌన్‌ప్లానింగ్

## ఏసిపిగా గుణశేఖర్

నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీప్లానర్‌గా తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో టిపిఓగా విధులు నిర్వహిస్తున్న గుణ శేఖర్‌కు ఏసిపిగా పదోన్నతి కల్పిస్తూ నెల్లూరుకు బదిలీ చేస్తున్నట్లు సమాచారం. ఆయనతో పాటు ఇతర నగరపాలక సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న హరిదాసు, సంజయ్‌లను కూడా ఏసిపిలుగా పదోన్నతి కల్పించినట్లు తెలుస్తోంది.

మెప్మా ఏఓగా

## వెంకటేశ్వర్లు

జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ (సిపిఓ) కార్యాలయంలో డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారిగా పనిచేస్తున్న పి.వెంకటేశ్వర్లు మెప్మా పరిపాలనాధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మెప్మా ఏ.ఓగా పనిచేస్తున్న భక్తశేఖరబాబును సిపిఓ కార్యాలయానికి బదిలీ చేశారు.


# నెల్లూరు కబుర్లు

## మళ్ళీ వస్తున్న రోశయ్య



తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య మరోసారి నెల్లూరు రానున్నారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి పలుమార్లు నెల్లూరుకు వచ్చిన రోశయ్య ఈ నెల 31వ తేదీ మళ్ళీ నెల్లూరొస్తున్నారు. ఆరోజు ఉదయం లక్ష్మీపురంలో డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆర్బన్ ఆర్యవైశ్య సంఘం భవనాన్ని ఆయన ప్రారంభిస్తారు.

## మార్చికల్లా బ్యారేజీలు రెడీ



- మంత్రి నారాయణ

వచ్చే ఏడాది మార్చినాటికల్లా జిల్లాలోని నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేస్తామని మున్సిపల్ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఈ నెల 24న నెల్లూరొచ్చిన ఆయన పగటిపూటే పెన్నా బ్యారేజీని పరిశీలించారు. బ్యారేజీ నిర్మాణ పనులపై ఇరిగేషన్ ఎస్ఇ కోటేశ్వరరావునడిగి వివరాలు తెలుసుకున్నారు. బ్యారేజీ నిర్మాణ పనులు చాలా వేగంగా చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

మంత్రిగారు మార్చి ఎందుకు టార్గెట్ పెట్టారో అర్థం కావడం లేదు. ఆయన విద్యాసంస్థల అధినేత కాబట్టి 'మార్చి' నెలతో సంబంధం ఎక్కువగా వుంటుంది. విద్యార్థులు మార్చి పరీక్షల్లో ఫెయిలైతే సెప్టెంబర్ ఉందికదా అని పూరట చెందుతారు. మంత్రిగారు కూడా పనులు పూర్తి కాకపోతే మార్చి కాకపోతే సెప్టెంబర్‌లో పూర్తవుతుందని వాయిదా వేయడానికి 'మార్చి'ని వాడారేమో!

## కుప్పకూలిన ఇండోర్ స్టేడియం

నెల్లూరు దర్గామిట్టలోని బారాషహీద్ దర్గా వద్ద వున్న జన్నత్‌హుస్సేన్ ఇండోర్ స్టేడియం సోమవారం రాత్రి కుప్పకూలింది. మూడున్నర దశాబ్దాల క్రితం దీనిని నిర్మించారు. బాగా పాడుపడిపోయింది. ప్రతిరోజూ ఆఫీసర్లు, స్థానికులు వచ్చి ఇక్కడ బ్యాడ్మింటన్ ఆడుతుంటారు. రాత్రి వేళ కూలడంతో ఎవరూ లేరు కాబట్టి ప్రమాదం తప్పింది.

కోలాహలంగా...

## శ్రీ పాండురంగ అన్నదాన సమాజం ఎన్నికలు

నెల్లూరు, పప్పులవీధిలోని శ్రీ పాండురంగ అన్నదాన సమాజం కొత్త కార్యవర్గానికి సంబంధించిన ఎన్నికలు 26వ తేదీ అసెంబ్లీ ఎన్నికలను తలపించే రీతిలో జరిగాయి. పోటీలో నిలిచిన అభ్యర్థులు నేరుగానే కాక ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలలో కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం దాకా ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం ఓట్ల కౌంటింగ్ జరిపారు. మొత్తం 413 ఓట్లకుగాను 389 మంది ఓట్లు వేశారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కొండా ప్రవీణ్‌శంకర్, కార్యదర్శిగా నీలిశెట్టి వెంకటేశ్వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.వి.సుబ్రహ్మణ్యం, సోమిశెట్టి నాగేశ్వరరావు, బొమ్మిశెట్టి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా నూకల బాలసుబ్రహ్మణ్యం, గుండ్లపల్లి మధుసూదన్‌రావు, దగ్గుమాటి మురళీకృష్ణ, కోశాధికారిగా బయ్యా ప్రసాద్‌లు గెలుపొందారు. గెలిచిన వాళ్ళు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

## సమాజానికి జాషువా కవిత్వం దిక్సూచి



సమాజానికి జాషువా కవిత్వం దిక్సూచి వంటిదని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వీరయ్య పేర్కొన్నారు. ఆదివారం జాషువా కవితాపీఠం సింహపురి విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ జాషువా వంటి మహానుభావుల కృషి ఫలితంగానే నేడు దళితులు అభివృద్ధి మార్గంలో నడుస్తున్నారన్నారు. జాషువా కవితా పీఠం అధ్యక్షుడు విద్వాన్ కిరణశ్రీ మాట్లాడుతూ జాషువా విగ్రహాన్ని నెల్లూరులో ప్రతిష్టించేందుకు ప్రభుత్వం అనుమతించడం చారిత్రాత్మక విజయమన్నారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఎస్.జయప్రకాష్ కీలక ఉపన్యాసం చేశారు. హైదరాబాదు తెలుగు అకాడమీ పూర్వసంచాలకులు కె.యాదగిరి మాట్లాడారు. పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# తీరంలో అభివృద్ధి తోరణం కృష్ణపట్నం

## • కాంకర్ కంటైనర్ సర్వీస్ ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రుల ప్రశంస



పోర్టులో కొత్తగా ఏర్పాటు చేసిన గోల్ఫ్ కోర్టును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రులు వెంకయ్యనాయుడు, సురేష్ ప్రభు

కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేష్ ప్రభు, కేంద్ర పట్టణాభివృద్ధి మరియు సమాచార ప్రసారాల శాఖ మంత్రి యం.వెంకయ్య నాయుడులు జిల్లా పారిశ్రామిక ప్రగతికి మణిహారం లాంటి కృష్ణపట్నం పోర్టును ఈ నెల 24న సందర్శించారు. పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ చింతా శశిధర్ వారికి ఆత్మీయపూర్వక స్వాగతం పలికారు. పోర్టులో కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(కాంకర్)కి చెందిన కంటైనర్ సేవలను వారు ప్రారంభించారు. కృష్ణపట్నం పోర్టు ప్రగతిని చూసి సురేష్ ప్రభు ఆశ్చర్యానికి లోనయ్యారు. తీరంలో ఈ పోర్టు ప్రగతి తోరణంగా మారిందని కితాబిచ్చారు. ఈ పోర్టులో కాంకర్ కంటైనర్ సేవలను ప్రారంభించడం వల్ల ఎగుమతి, దిగుమతికి సులభంగా వుంటుందన్నారు. మైనర్ పోర్టుగా ప్రారంభమైన కృష్ణపట్నంను అతి తక్కువకాలంలోనే దక్షిణాసియాలోనే అగ్రస్థానంలో నిలిపారంటూ పోర్టు యాజమాన్యాన్ని అభినందించారు. సముద్రతీరంలోని పోర్టులను అభివృద్ధి చేసి, తయారీ రంగాలను ప్రోత్సహించడం ద్వారా జిడిపిలో అభివృద్ధి సాధించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

వెంకయ్యనాయుడు తన ప్రసంగంలో ముత్తుకూరులోని థియేటర్‌లలో చూసిన సినిమాలు, సముద్రతీరంలోని ఇసుక తిన్నెల్లో ఆడుకున్న ఆటలను గుర్తు చేసుకున్నారు. కృష్ణపట్నం పోర్టు ద్వారా పారిశ్రామికాభివృద్ధితో పాటు సామాజికాభివృద్ధి కూడా జరుగుతుందంటూ, సివిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, కెపిసిటి డైరెక్టర్ వినీతా వెంకటేష్, కాంకర్ ఛైర్మెన్ అనిల్‌కుమార్ గుప్తా, ఆర్‌విఎన్‌ఎల్ ఛైర్మెన్ అగ్నిహోత్ర, కెపిసిటి సిఇఓ జితేంద్ర, పోర్ట్ పిఆర్ హెడ్ జి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు రైల్వేకి ఆధునిక హంగులు



నెల్లూరు రైల్వేస్టేషన్లను ఆధునీకరించి ప్రయాణీకులకు సౌకర్యయుతంగా వుండేలా అన్ని చర్యలూ తీసుకుంటామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి సురేష్ ప్రభు తెలిపారు. ఈ నెల 24న ఆయన కేంద్ర సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి వెంకయ్య నాయుడుతో కలసి నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌కు వచ్చి, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. రైల్వేశాఖ పరంగా నెల్లూరు జిల్లాను అభివృద్ధి చేస్తామని, నెల్లూరు రైల్వే రూపురేఖలు మార్చి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నెల్లూరు సౌత్‌స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణానికి రిమోట్ కంట్రోల్ విధానం ద్వారా ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా సురేష్‌ప్రభు మాట్లాడుతూ, నెల్లూరు రైల్వేకి సంబంధించిన పలు సమస్యలను కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు తనకు వివరించారని, ఆ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామంటూ, వెంకయ్య నాయుడు వల్లే జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని కొనియాడారు. నెల్లూరు మీదుగా పలు కొత్త రైళ్ళను వేస్తామన్నారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, నెల్లూరు రైల్వేస్టేషన్‌కు త్వరలోనే వైఫై సౌకర్యాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. గూడూరు–సికింద్రాబాద్‌ల మధ్య నడుస్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ సమయాన్ని కూడా ప్రయాణీకులకు అనువుగా మార్చేందుకు సంబంధిత అధికారులతో సంప్రదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ శ్రీమతి జానకి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, గూడూరు వైఎస్సార్సీపి నాయకుడు మేరిగ మురళి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన సిఎం

### ----- జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి విమర్శ -----



జడ్పీ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారంటూ జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తన జన్మదినోత్సవం, ఛైర్మెన్‌గా రెండేళ్ళ పాలన పూర్తయిన రోజైన ఈ నెల 24న ఆయన నగరంలోని దర్గామిట్టలో వున్న జడ్పీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఛైర్మెన్‌గా మొదటి సంవత్సరం తనకు సంతృప్తినిచ్చిందని, రెండవ సంవత్సరం ఆశించిన స్థాయిలో అభివృద్ధిని సాధించలేకపోయామని అన్నారు. అందుకు ప్రభుత్వమే కారణమని విమర్శించారు. స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు కానీ, పన్నులు కానీ రాకపోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని నిరాశను వ్యక్తం చేశారు. తమకున్న నిధుల్లోనే శక్తిమేరకు ప్రజల అవసరాలు తీర్చేందుకు కృషి చేశామన్నారు. ఏళ్ళ తరబడి అనేక పాఠశాలల్లో మరమ్మతులకు గురైవున్న వేలాది కంప్యూటర్లను బాగుచేయించి, కంప్యూటర్‌ల ద్వారా విద్యాబోధనను పునరుద్ధరించగలిగామన్నారు. ఈ ఏడాది 8,9 తరగతులకు మార్గదర్శి ప్రత్యేక మెటీరియల్‌ను అందజేస్తామన్నారు. కార్పొరేట్ కబంధహస్తాల్లో చిక్కుకుపోయిన బోర్డ్ ఆఫ్ ఇంటర్‌మీడియట్‌ను రద్దు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పాఠశాల స్థాయిలోనే 11, 12 తరగతులు విద్యావిధానాన్ని అమలు చేయాలన్నారు. సెకండరీ ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ డిజైన్ (సీడ్) ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తం చేస్తామని, ఛైర్మెన్ పదవితో నిమిత్తం లేకుండా ఇంటర్‌బోర్డు ప్రక్షాళనకు ఉద్యమించడం తన ఏకైక లక్ష్యమని అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్‌చేసి, జడ్పీ కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి, ఇన్‌ఛార్జ్ ఏ.ఓ వసుమతి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుకు నయాపైసా ఇవ్వని నారాయణ

### - జంట ఎమ్మెల్యేల ధ్వజం



మున్సిపల్ మంత్రి నారాయణ పేరు వింటేనే ఒంటికాలి మీద లేచే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ యాదవ్‌లు మరోసారి ఆయనను నోరారా విమర్శించారు. నెల్లూరుకు నారాయణ నయాపైసా పని చేయలేదని 26వ తేదీ నెల్లూరులోని రాజన్న భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దెప్పిపొడిచారు. నగరానికి 200కోట్లు నిధులు తెచ్చానని నారాయణ చెప్పుకుంటున్నాడని, నెల్లూరుకు 13వ ఆర్థిక సంఘం కార్పొరేషన్ గ్రాంట్లు తప్ప ప్రభుత్వం నుండి పైసా రాలేదన్నారు. నెల్లూరును స్మార్ట్ సిటీగా చేస్తామని చెప్పి 1136కోట్లు హడ్కో అప్పు తెస్తున్నారు. ఇది ప్రజలపై భారం మోపడమే. ఈ అప్పును కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు కడతాడా? లేక మున్సిపల్ మంత్రి నారాయణ కడతాడా? అని వారు ప్రశ్నించారు. ఈ హడ్కో అప్పును గ్రాంటుగా మార్చాలని మేమెన్నిసార్లు కోరినా మంత్రి పట్టించుకోలేదు. కేవలం కమీషన్లకు కక్కుర్తిపడే జైకా నిధులను కాదని, హడ్కో నిధులకు వెళ్లారని వారు విమర్శించారు. హడ్కో ఋణంకు సంబంధించిన వివరాలను వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఏర్పడ్డ వైయస్సార్ నగర్‌లోని పక్కా గృహాలను పూర్తి చేయకపోగా, మూడునెలల్లో నిర్మాణాలను పూర్తి చేయకుంటే, పక్కా గృహాలను రద్దుచేస్తామని, స్థలాలు లాక్కుంటామని లబ్ధిదారులను భయాందోళనలకు గురిచేయడం సిగ్గుచేటని వారు విమర్శించారు. మంత్రి నారాయణ మెప్పు కోసం మేయర్ అజీజ్, తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు లేని గొప్పతనాన్ని మంత్రికి ఆపాదిస్తూ, ఆయనకు భజన చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ద్వారకానాథ్, పి.రూప్‌కుమార్‌యాదవ్, బి.శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలతో చెలగాటమే!

### - సిపిఎం మధు



నెల్లూరుజిల్లా కావలి సమీపంలో అణువిద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గపు చర్యని, ఇది ప్రజల ప్రాణాలతో చెలగాట మాడడమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మండిపడ్డారు. ఈ నెల 23న నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంటు ఏర్పాటు ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్లాంటు ప్రతిపాదిత ప్రాంతంలో 17వేల మంది నివసిస్తున్నారని, అనుకోకుండా ఏదన్నా ప్రమాదం జరిగితే 170కిలోమీటర్ల పరిధిలో జనావాసాలను ఖాళీ చేయించాల్సి వస్తుందన్నారు. అణు విద్యుత్ కాలుష్యం మూలంగా నపుంసకత్వం, గర్భస్రావాలతో పాటు దీర్ఘకాల వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. అమెరికా అణు రియాక్టర్లను అమ్ముకోవడం కోసమే మన దేశంతో స్నేహం నటిస్తుందని విమర్శించారు. అణు విద్యుత్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి తమ పార్టీ పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ పాల్గొన్నారు.

# ఆరుగంటల నుండే ప్రజాసాధికారత సర్వే

**- జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు**



నెల్లూరుజిల్లా ప్రథమపౌరుడు బాధ్యతలు చేపట్టిన రెండవరోజే ప్రజలతో మమేకమయ్యారు. నింపాదిగా ఉన్న అధికారులను సిబ్బందిని మేల్కొలిపి ఉత్సాహంగా పనులు చేసేందుకు పురమాయించారు. ఈమధ్య ప్రారంభించిన ప్రజాసాధికారత సర్వే సాంకేతిక కారణాల వల్ల నత్తనడకన సాగుతున్న విషయం తెలిసిందే. ఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో నెల్లూరుజిల్లా నూతన కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఆ దిశగా పయనిస్తున్నారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ నెల్లూరులోని వెంకటేశ్వరపురం బోడిగాడితోట, ఇన మడుగు దళితవాడల్లో ప్రజాసాధికారత సర్వే గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం 6గంటల నుండే సర్వే ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆరు గంటలకే సర్వేను ప్రారంభిస్తే ఆ కుటుంబంలోని సభ్యులం దరూ అందుబాటులో ఉంటారన్నారు. దీనివల్ల సర్వే అనుకున్న సమయానికి పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సర్వేను సకాలంలో పూర్తి చేయడానికి మరింత సిబ్బందిని పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఆధార్ కార్డులో తప్పులు వుంటే వెంటనే వాటిని సరిదిద్దించి సర్వేని పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే సిబ్బందిని మోటివేషన్ చేసి త్వరగా సర్వే పూర్తి చేసే విధంగా చూడాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్య ఉండదని, పట్టణ ప్రాంతాల్లో ఇళ్ళు ప్రక్కప్రక్కన ఉంటాయి కాబట్టి సర్వేను జాగ్రత్తగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వారంరోజుల పాటు

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**- కర్నాటి ఆంజనేయరెడ్డి**



భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70ఏళ్లు అయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు రాష్ట్రంలో వారంరోజుల పాటు 'తిరంగా' పేరుతో వేడుకలు నిర్వహిస్తామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య స్ఫూర్తిని అన్ని వర్గాల ప్రజల్లో నింపేందుకు అన్ని మండల కేంద్రాల్లో జాతీయ జెండా చేతపట్టి ఈ తిరంగా యాత్రలను నిర్వహిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకు ప్రతి జిల్లాకు ఒక్కో కేంద్రమంత్రి చొప్పున మొత్తం 13మంది కేంద్రమంత్రులతో ఆయా జిల్లా కేంద్రాలలో కార్యకర్తల, మేధావుల సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో ఏలూరులో రైతుర్యాలీ, కడపలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీజేపీ నేతలు సుధాకర్‌రెడ్డి, మధు, శేషారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

## క్యాన్సర్ బాధితుడికి

# బ్రాహ్మణ సేవాసంఘం చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం ప్రతినిధులు

గూడూరు బనిగిసాహెబ్‌పేటలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న స్థానిక రామాలయం పూజారి కొడగండ్ల రాఘవాచారికి గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం తరపున అధ్యక్షులు అమరగుడిపాటి చలపతిరావు ఫలసరకులు మరియు పండ్లు, కొంత నగదు వారి కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందించారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం కార్పొరేషన్‌కి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించవలసినదిగా విజ్ఞప్తి చేస్తూ అర్జీని సమర్పించి ఉన్నామని త్వరలో వారి కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తారని తెలియజేశారు. పేదవిద్యార్థిని, విద్యార్థులకు ఆర్థిక సాయం చేసేదానికి సంస్థ ముందుంటుందని తెలిపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ స్థాపించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, కార్పొరేషన్ ఛైర్మెన్ ఐవైఆర్ కృష్ణారావుకి, జిల్లా కోఆర్డినేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షులు అనిమెళ్ళ శివకుమార్, జి.కె.నాథబ్రహ్మం, కార్యదర్శి శ్రీనివాసరావు, పెద్దాడు వెంకటరమణ, పిదూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- గూడూరు జంక్షన్‌లో...

# నాలుగో ప్లాట్‌ఫామ్

గూడూరు రైల్వేస్టేషన్‌లో 4వ ప్లాట్‌ఫామ్ నిర్మాణానికి సంబంధించి వీడియో లింకు ద్వారా ఆదివారం నెల్లూరు నుంచి కేంద్ర రైల్వేమంత్రి సురేష్‌ప్రభు, కేంద్ర సమాచార శాఖామంత్రి వెంకయ్యనాయుడు ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరులో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 4వ ప్లాట్‌ఫాం మంజూరు కావడం, నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో గూడూరు నియోజకవర్గ ప్రజల తరపున కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ ప్లాట్‌ఫాం నిర్మాణంతో పడమర గూడూరుకు రెండో ప్రవేశమార్గం ఏర్పడుతుందన్నారు. ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ పడమర గూడూరు ప్రజలు రైల్వేస్టేషన్‌కు వచ్చి రైలు ఎక్కాలంటే పలు ఇబ్బందులు పడుతున్నారని, 4వ ప్లాట్‌ఫాం నిర్మాణం ద్వారా ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ఎం వేణుగోపాల్‌రావు, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి, సిఐ బ్రహ్మానందరెడ్డి, స్టేషన్ మేనేజర్ తిలకం, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, బొమ్మిరెడ్డి పద్మ, సోమిశెట్టి చెంచు రామయ్య, చంద్రయ్య, కోదండ రామయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్

# విస్తృత సేవలతోనే గుర్తింపు



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ గిరీషా

ప్రజలకు విస్తృతంగా సేవలందిస్తే ప్రత్యేక గుర్తింపు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తూ చిత్తూరు జేసీగా పదోన్నతిపై వెళ్ళిన గిరీషాను సోమవారం రాత్రి సబ్‌కలెక్టర్ బంగ్లాలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, అనధికారులు మాట్లాడుతూ ప్రజల మనసులో స్థానం సంపాదించాలంటే వారికి చేరువ అయితేనే సాధ్యమని, ప్రతి ఉద్యోగి ఆ దిశగా ముందుకు సాగితే విశేష గుర్తింపు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పురపాలక ఛైర్మెన్ పొనకా దేవసేన, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, ఎస్‌డిసి వెంకటసుబ్బయ్య, నాయుడుపేట ఆర్డీవో శీనా నాయక్, డివిజన్‌లోని పలువురు తహశీల్దార్లు, ఎంపిడివోలు, డిటిలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడి అరెస్ట్

గూడూరు డివిజన్ నాయుడుపేట పట్టణం తుమ్మూరు ప్రాంతం రాజగోపాలపురంలోని పాలెపు హజరత్ అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడు దేవిరెడ్డి నాగరాజుని సోమవారం అరెస్ట్ చేసినట్లు గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు డిఎస్పీ కార్యాలయంలో నాయుడుపేట సిఐ రత్తయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇందుకూరుపేట మండలం నరుకూరు గ్రామానికి చెందిన పాలెపు హజరత్‌ని ఈనెల 19వతేదీ రాత్రి చేజర్ల చంద్రకళ ఇంటి ముందు అత్యంత దారుణంగా హత్యచేసి శవం గుర్తుపట్టలేని విధంగా కాల్చి వేసిన సంఘటనలో ప్రధాన నిందితుడు నాగరాజు అని తెలిపారు. ముద్దాయి పెయింట్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడని, మృతుడు



వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ బి.శ్రీనివాస్

తల్లిదండ్రులు చిన్నతనంలో చనిపోవడంతో అనాథగా తిరుగుతుంటాడని చెప్పారు. నిందితున్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు డిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

# క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

గూడూరులోని సునీతా సేవాసంస్థ ఆధ్వర్యంలో రెండో పట్టణంలోని నరసింగరావుపేట ప్రాంతంలో ఉన్న బాలసదన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇటీవల క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. నెల్లూరుకు చెందిన రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యురాలు డా॥ లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. నిర్లక్ష్యం చేయకుండా తగిన సమయంలో వైద్యపరీక్షలు చేయించుకొని మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి సారంగం సులక్ష్మి, పట్టణ సిడిపివో ఉమామహేశ్వరి, పర్యవేక్షకులు ఆశాబేగం, ప్రమీల, సుబ్బరావమ్మ, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వైద్యురాలు లక్ష్మి ప్రక్కన సారంగం సులక్ష్మి తదితరులు

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. దూర ప్రయాణాలుంటాయి. కొత్త విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. బాకీలు రావలసినవి నిలబడిపోతాయి. అనవసర విషయాలలో జోక్యం పనికిరాదు. చేపట్టిన పనులకు ఆటంకాలుంటాయి. అయితే ఇతరుల సహకారంతో నెరవేరగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

శుభవార్తలు వింటారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, శుభకార్యాలు నిర్ణయం జరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. ఉన్నత విద్యావకాశాలు దొరుకుతాయి. ప్రముఖులను, ముఖ్యులను కలుసుకొంటారు. కొత్త పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు అవకాశాలు దొరుకుతాయి. ఆర్థికంగా బాగుండి, వృత్తులలో గాని వ్యాపారాలలో గాని ఆదాయం పెరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. శుభవార్తలు వింటారు. నూతన వస్తువులు సమకూరుతాయి. విద్యావకాశాలు బాగుంటాయి. అనుకోని అదనపు ఖర్చుల వల్ల ఋణం చేయవలసి వస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించడానికి కొంత సమయం పడుతుంది. శుభకార్యాల నిర్ణయమై ప్రముఖంగా వ్యవహరిస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలలో సంతృప్తి ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత, అప్పుడప్పుడు టెన్షన్‌గా ఉండటం, కుటుంబసౌఖ్యం నూతన వస్తువులను సమకూర్చుకొనడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు లాభదాయకంగానే సాగుతాయి. సన్నిహితుల సహకారంతో అనుకున్న బాకీలు అందుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కుటుంబ, ఆర్థిక, ఉద్యోగ వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండాలి. సన్నిహితులు బంధువుల వల్ల సమస్యలు రాగలవు. వ్యాపార అవకాశాలు తగ్గుతాయి. పొరపాటు నిర్ణయాలు, పొరపాటు సలహాలివ్వడం చేయవద్దు. కోర్టు వ్యవహారాలు, శుభకార్య నిర్ణయాలు వాయిదా పడగలవు. ఆస్తి వ్యవహారాలు, రావలసిన డబ్బులు కొంత పరిష్కారం కాగలవు. అనుకోని దూరప్రయాణాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకున్న పనులు సక్రమంగా జరిగినా టెన్షన్ ఎక్కువగా కలదు. అనవసర వ్యవహారాల జోలికి వెళ్ళ వద్దు. బంధుత్వాలు బలపడి అవగాహన బాగుంటుంది. కుటుంబసౌఖ్యం, స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. వ్యాపారాలలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. తగాదాలు మనస్పర్థలు సర్దుబాటు కాగలవు. ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 29.7.2016 నుండి**
**తేది. 4.8.2016 వరకు**

ఈ వారము వృషభ, మిధున సింహ కర్కాటక రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రవిశుక్రులు, 31తేది నుండి సింహంలో శుక్రుడు, సింహంలో బుధ గురు రాహువులు, వృశ్చికంలో శని కుజులు, కుంభంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 29 శుక్రవారము ఆడి కృతిక
ముహూర్తములు లేవు

### ఆషాఢ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 29 | శుక్ర | దశమి | ఉ॥ గం.10.44వ॥ |
| తేది. 30 | శని | ఏకాదశి | ఉ॥ గం.8.28వ॥ |
| తేది. 31 | ఆది | ద్వాదశి | ఉ॥ గం.6.26వ॥ |
| | పిదప | త్రయోదశి | పూర్తిగ |
| తేది. 1 | సోమ | చతుర్దశి | రా॥ గం.3.10వ॥ |
| తేది. 2 | మంగళ | అమావాస్య | రా॥ గం.2.11వ॥ |

### శ్రావణ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 3 | బుధ | పాడ్యమి | రా॥ గం.1.43వ॥ |
| తేది. 4 | గురు | విదియ | రా॥ గం.1.43వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇతరులకు సహాయం అందిస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. కొత్త పరిచయాలు మేలు చేస్తాయి. ఉన్నత విద్యావకాశాలు బాగుంటాయి. వృత్తి ఉపాధి పథకాలలో రాణిస్తారు. కొత్త పెట్టుబడులకు, వ్యాపారముల విస్తరణకు అవకాశాలుంటాయి. ఆస్తి వ్యవహారాలు, బాకీల వ్యవహారాలు ఒక పరిష్కారానికి వచ్చే అవకాశాలున్నవి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్య ప్రయత్నాలు అనుకూలం కాగలవు. విదేశీ, దూర ప్రాంతముల సందర్శనల ప్రయత్నాలు జరుగుతాయి. ఉద్యోగార్థులకు, విద్యార్థులకు ఉన్నత అవకాశాలు లభించగలవు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. నిలబడిపోయిన పనులకు చలనం కలుగుతుంది. వృత్తి జీవనం కలవారికి అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. సొంత నిర్ణయాలు మంచిది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

సామాన్య ఆదాయముంటుంది. కుటుంబ వ్యక్తులకు అనారోగ్య బాధలుంటాయి. అనవసర వ్యవహారాలు జరుపవద్దు. చేపట్టిన పనులకు ఆటంకాలుంటాయి. డబ్బు, వస్తువులు పోగొట్టుకొనకుండా జాగ్రత్తపడండి. విద్యావకాశాలు బాగుంటాయి. అన్నింటా సర్దుబాటు అవసరం. ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త వహించాలి. బంధువర్గం వల్ల పేచీలు రావచ్చును.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

సోదరవర్గంతో పేచీలు లేకుండా చూచుకొనాలి. శుభకార్యాలు అనుకూలించగలవు. చిన్నచిన్న విషయాలను తీవ్రంగా పరిగణించకుండా సంయమనం పాటించాలి. ఆత్మీయుల నుండి శుభవార్తలు వింటారు. వృత్తి వ్యాపారాలు మెల్లగా అభివృద్ధి చెందుతాయి. ఆర్థిక ఇబ్బందులు తొలగి అవకాశాలు వేగమందుకుంటాయి. ఆర్థిక ఇబ్బందులు తొలగి అవకాశాలుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. అధికారులకు స్థానమార్పులు, అదనపు బాధ్యతలు, ఉద్యోగులకు పని భారం ఉంటుంది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడవచ్చును. రావలసిన బాకీలు నిలబడిపోగలవు. పట్టుదల, దీక్షతో అనుకున్న పనులకు ఆటంకాలొచ్చినా పనులు సాధించుకుంటారు. ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. వ్యాపార వృద్ధి అవకాశాలు దొరుకుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. అనుకున్న ప్రయాణ లక్ష్యాలు నెరవేరతాయి. ఉన్నత విద్యావకాశాలు, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఉద్యోగులు సమర్థత బాగుండును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అనుకున్న పనులు విజయవంతంగా నెరవేర్చుతారు. ఉన్నత విద్యా ఉద్యోగావకాశాలు లభించగలవు. వ్యాపారాలలో అభివృద్ధి బాగుంటుంది.

# రాహుల్‌కు పార్లమెంట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

శ్రీను గల్పిక

అది ఢిల్లీలోని టెన్‌జనపథ్. వంట గదిలో సోనియాగాంధీ వంట పనిలో వుంది. వి. హెచ్.హనుమంతురావు ఉల్లిపాయలు, బంగాళదుంపలు తరిగిస్తూ, మసాలా దినుసులనందిస్తూ ఆమెకు సహాయం చేస్తున్నాడు. ఇంకోపక్క పనబాక లక్ష్మి క్యారేజీ గిన్నెలు తోముతుంది. అందరూ హడావిడిగానే వున్నారు. సోనియా వుండి వి. హెచ్‌తో... బాబు నిద్ర లేచాడా అని అడిగింది. ఇంతకు ముందే లేచాడు మేడమ్, బెడ్‌కాఫీ ఇచ్చాను, బాత్‌రూంకు కూడా వెళ్లొచ్చాడు. బాబు మనం చెప్పకుండానే తన పనులు తాను ఎంతో చక్కగా చేసుకుంటున్నాడు మేడమ్, దేశానికి ఇంతకంటే మంచి ప్రధానిని ఎక్కడ తేగలం అని విహెచ్ సమాధానమిచ్చాడు. ఏం చేద్దాం హనుమంతుజీ... రాహుల్‌లో మనం గుర్తించిన తెలివితేటలను ఈ దేశ ప్రజలు గుర్తిస్తేగా, మన యువరాజు టాలెంట్‌ను వాళ్లు వాడుకుంటేగా.. అని సోనియా నిష్టూరంగా మాట్లాడింది. అప్పుడు అంట్లు తోముతున్న అంబికా సోని అందుకుని... మీరేం వర్రీ కాకండి మేడమ్... ప్రతి పులికి ఒక రోజు అనేది వస్తుందంటారు, అట్లాగే మన యువరాజుకు ఏదో ఒక రోజు ప్రధాని అయ్యే ఛాన్స్ వస్తుందని అంది. వి. హెచ్ కలుగజేసుకుని... అదేంటి ఆ సామెతను రాంగ్‌గా చెబుతున్నావ్... ప్రతి కుక్కకు ఓరోజు వస్తుందని కదా సామెత అని అడిగాడు. అంబికా సోని వెంటనే... నాకు తెలుసులే హనుమంతుజీ... కాకపోతే కుక్క బదులు పులి అని వాడితే గంభీరంగా వుంటుందని అలా చెప్పాను అని అంది. ఇలా వీళ్ల మాట్లాడుకుంటుండగానే క్యారేజీ రెడీ చేసి బుట్టలో సర్దేసారు.

రాహుల్‌గాంధీ అప్పుడే నీట్‌గా ముస్తాబై కారు వద్దకు వచ్చాడు. ఆయన పార్లమెంటు సమావేశాలకు బయలుదేరుతున్నాడు. పనబాక లక్ష్మి క్యారేజీ బుట్టను కారు డిక్కీలో పెట్టింది. వెంటనే హనుమంతురావు ఒక పరుపు, దిండును, దుప్పటిని కూడా డిక్కీలో వేశాడు. అది చూసి సోనియా... క్యారేజీ పెట్టించామంటే అర్థముంది, లంచ్ అవర్‌లో తినడానికి, ఈ పరుపు, దిండు సంగతేంటని అడిగింది. అందుకు వి. హెచ్... నేను టీవీలో చూసానమ్మా... ఈమధ్య పార్లమెంటు సమావేశాల మధ్యలో మన రాహుల్ బాబు బెంచిమీదే తలవాల్చి నిద్రపోతున్నాడు. బహుశా స్కూల్‌రోజుల్లో కూడా ఇలాగే నిద్రపోయుంటాడనుకుంటా! టీవీలో ఆ సీన్ చూసినప్పటి నుండి నాకు భలే బాధేసింది. ఇంత బ్రతుకు బతికి పార్లమెంటులో బెంచీల మీద పడుకుని నిద్రపోవాల్సిన ఖర్మేంటి? హాయిగా పరుపు మీద పడుకొని నిద్రపోవచ్చుగా! అందుకే పార్లమెంటు సమావేశాలు జరిగే సమయంలో మధ్యలో రాహుల్ బాబుకు ఎప్పుడు నిద్రొచ్చినా సౌకర్యవంతంగా నిద్రపోయేలా ఈ పరుపు, దిండు పెట్టించానమ్మ అని చెప్పాడు. ఆ మాటతో సోనియా కళ్ల వెంట నీళ్లు నయాగార జలపాతంలా కారాయి. నువ్వెంత మంచివాడివి హనుమంతుజీ... తల్లినైన నేను కూడా రాహుల్ గురించి అంత లోతుగా ఆలోచించలేదు, ఈసారి కూడా నీకు రాజ్యసభ ఓకే అంటూ రాహుల్ వైపు తిరిగి... నాయనా, టైంకు భోజనం చేయ్, మధ్యలో నిద్రొస్తే ఆలోచించకుండా పడుకో... మధ్యలో మెళకువ వచ్చినప్పుడు లేచి... అధ్యక్షా, ఇది సూటూ బూటు ప్రభుత్వం, ఈ ప్రభుత్వం మైనార్టీలను తొక్కేస్తోంది, ఈ ప్రభుత్వంలో మతతత్వ దాడులు పెరిగాయని విమర్శలు చెయ్... నువ్వు అలర్ట్‌గా వున్నావని అందరూ అనుకుంటారు అని జాగ్రత్తలు చెప్పి పంపించింది.

★★★★★

పార్లమెంటు భవనంలో లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు విడివిడిగా ప్రారంభమయ్యాయి. లోక్‌సభలో స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్ష స్థానంలో కూర్చున్నారు. సభ్యులంతా వారి వారి స్థానాలలో ఆశీనులయ్యారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ గేటు వైపే చూడసాగాడు. స్పీకర్ వుండి... అరుణ్‌జైట్లీజీ... ఎందుకు అలా గుమ్మంవైపే చూస్తున్నారని అడిగింది. దానికి జైట్లీ... ప్రధాని నరేంద్ర మోడీ ఈరోజు సభకు వస్తానన్నారు మేడమ్, రెండ్రోజుల నుండి ఇండియాలోనే వున్నారు, పార్లమెంట్‌కు వచ్చి చాలా రోజులయ్యింది, పొరపాటున అడ్రస్ ఏమన్నా మిస్సయ్యాడేమోనని డౌట్‌గా వుందన్నాడు. అంతలో మోడీ లోపలకు రానే వచ్చాడు. జైట్లీ ఊపిరి పీల్చుకుని... హమ్మయ్యా, వచ్చేసారా, పార్లమెంట్ అడ్రస్ తెలుసుకుంటారో, లేదోననుకుంటున్నానని అన్నాడు. అందుకు మోడీ... నేను నీ కంటికి పార్లమెంట్ అడ్రస్ కనుక్కోలేనంతటి అమాయకుడిలా కనిపిస్తున్నాననుకున్నావా, నా కారులో జిపిఎస్ వుందిగా... అదే పార్లమెంట్ అడ్రస్ చూపించింది. ఈజీగానే రాగలిగానని చెప్పాడు. తర్వాత సభ మొదలైంది. కాంగ్రెస్ నేత జ్యోతిరాదిత్య సింధియా లేచి... అధ్యక్షా! ఈ ప్రభుత్వం పోరాట యోధులను చంపుతోంది. కాశ్మీర్‌లో బుర్హాన్‌వాని అనే యువకుడిని ఇలానే ఎన్‌కౌంటర్ చేసింది, మన పౌరులను మనమే చంపుకుంటామా, వాళ్లు చేసిన తప్పేంటి? సైనికుల మీద రాళ్లేసారు? ఇండియా జెండాలను తగలబెట్టారు? పాక్ ప్రేరేపిత వేర్పాటువాదానికి మద్దతు కూడగట్టారు. ఇంత మాత్రానికే మనుషులను చంపుకుంటూ పోతుంటే, ఈ భూమ్మీద మనుషులే మిగలరు. ముందు మనుషులను ప్రేమించండి, మహా అయితే వాళ్లు కూడా మనల్ని ప్రేమిస్తారు... అని చెప్పాడు. వెంటనే రాజ్‌నాథ్‌సింగ్ లేచి... అవును మనం వారిని మాటలతో ప్రేమిస్తాం, ఆ తర్వాత వాళ్లు మనల్ని తూటాలతో పేలుస్తారు, మీ జవహర్‌లాల్ నెహ్రూ ఇలా ప్రేమించబట్టే కాశ్మీర్ సమస్య ఇలా తగలబడిందన్నాడు. ఆ మాటకు కాంగ్రెస్ సభ్యులు లేచి గోల చేస్తూ.... నెహ్రూ గురించి ఇప్పుడు అవసరమా? ఆయన్ను అనే అర్హత మీకు లేదు అని అనసాగారు. ఆ సమయంలో రాహుల్ అప్పటికే కునుకు తీస్తున్నాడు. పక్కనే వున్న మల్లిఖార్జున ఖర్గే, రాహుల్‌ను తట్టి... సార్, మీరు వెంటనే ఈ సబ్జెక్ట్‌ను ఖండిస్తూ మాట్లాడండి అని సూచించాడు. నిద్రమత్తులో వున్న రాహుల్ ఠక్కున లేచి... మైనార్టీలపై దాడులను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను, ఈ ప్రభుత్వం లౌకిక స్ఫూర్తిని కాల రాస్తుంది, మతోన్మాదాన్ని ప్రేరేపిస్తుందని అన్నాడు. అక్కడ చర్చ జరిగే సబ్జెక్ట్‌కు రాహుల్ మాట్లాడిన మాటలకు పొంతన ఏంటో అర్థం కాక మల్లిఖార్జున ఖర్గే బుర్ర గోక్కున్నాడు.

తర్వాత ఏపికి ప్రత్యేకహోదా కోరుతూ రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు కె.వి.పి.రామచంద్రరావు ప్రవేశపెట్టిన ప్రైవేట్ బిల్లు లోక్‌సభలో చర్చకు వచ్చింది. ఈ బిల్లును ఆమోదించాలంటూ కాంగ్రెస్‌తో పాటు తెలుగుదేశం, వైకాపా సభ్యులు డిమాండ్ చేయసాగారు. బీజేపీ సభ్యులు మాత్రం... మీ ప్రభుత్వం ఉన్నప్పుడు విభజన బిల్లులో దీనిని ఎందుకు పెట్టలేదంటూ నిలదీస్తున్నారు. ఈ చర్చ జరుగుతున్నప్పుడే రాహుల్ మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు. ఏపికి ప్రత్యేక హోదాకు సంబంధించిన సబ్జెక్ట్ కావడంతో దీని మీద రాహుల్ మాట్లాడితే పార్టీకి మైలేజీ వస్తుందని మల్లిఖార్జున ఖర్గే భావించాడు. వెంటనే నిద్రపోతున్న రాహుల్ భుజం తట్టి... సార్, ఏపి విభజన బిల్లు మీద చర్చ... అని చెబుతుండగానే రాహుల్ లేచి... ఈ సబ్జెక్ట్ అంతా నాకు తెలుసు... అంటూ లేచి... ఆరునూరైనా ఏపి విభజన ఆగదు, హైదరాబాద్ తెలంగాణదే... ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇచ్చేదీ లేదు... అంటూ కూర్చున్నాడు. ఆ మాటకు కాంగ్రెస్ సభ్యుల తలలు ఒక్కసారిగా నూటఇరవై కిలోమీటర్ల వేగంతో తిరగసాగాయి. ఆ షాక్ నుండి తేరుకున్నారే గాని వారికి అర్థం కాలేదు... తమ బాస్ నిద్రలోకి పోయి తిరిగి లేస్తే మూడేళ్లు వెనక్కిపోయి ఉంటాడని...!

# ఆగస్ట్ 1 నుంచి 'డయల్ యువర్ కలెక్టర్'



ప్రజాసమస్యల పరిష్కారానికి కొత్త కలెక్టర్ ముత్యాలరాజు శ్రీకారం చుడుతున్నారు. ప్రజల సమస్యలను నేరుగా విని, తగు పరిష్కారాలను అందించేందుకు ఆగస్ట్ 1 నుంచి ప్రతి సోమవారం 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2499 అనే నంబర్‌ను సిద్ధం చేశారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజలు ఫోన్ చేయగానే కాల్‌సెంటర్ సిబ్బంది ముందుగా ఆ సమస్యలను తెలుసుకుని, కలెక్టర్‌కు ఫోన్ లింక్ చేస్తారు. కలెక్టర్ స్వయంగా ప్రజలతో మాట్లాడి ఆ సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులకు పరిష్కారానికి ఈ-మెయిల్ ద్వారా పంపుతారు. ఈ సంభాషణలు మొత్తాన్నీ రికార్డు చేయనున్నారు. భూముల సమస్యలు, రేషన్‌కార్డుల సమస్యలు, మంచి నీరు, ఇందిరమ్మ ఇళ్లు, పారిశుద్ధ్యం, పాఠశాలల్లో మౌలిక వసతులు తదితర సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్‌కు స్వయంగా ప్రజలు విన్నవించుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా ఎందరో నిరుపేదలు తమ సమస్యల పరిష్కారానికి వ్యయప్రయాసలతో నెల్లూరుకు వచ్చి కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నారు. ఈ శ్రమ లేకుండా కలెక్టరే నేరుగా టెలిఫోన్ ద్వారా ప్రజలకు అందుబాటులో వుండేందుకు 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమం ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాల్సి వుంది.

## 'వర్డ్ గేమ్'లో బిజిఆర్ విద్యార్థినుల ప్రతిభ



నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంగ్ల పదాలతో కూడిన 'వర్డ్ గేమ్ షో'ను ఆంగ్ల అధ్యాపకురాలు శ్రీమతి గౌరీ ప్రయాగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు చురుగ్గా పాల్గొని తమ ప్రతిభను కనుపరిచారు. సెకండియర్ బిఎస్సీ విద్యార్థినులు ప్రియా షోరేన్, అనూహ్య విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ జెవి రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థి నుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసి, వారిని పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయవచ్చున్నారు. అబ్దుల్ కలాం ప్రధమ వర్ధంతిని పురస్కరించుకుని విజ్ఞానదాయకమైన ఈ పోటీలు నిర్వహించి ఆ మహనీయునికి ఈ కార్యక్రమాన్ని అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో రోటేరియన్ సనత్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అద్దాల మందిరం వైద్య శిబిరం



గురుపౌర్ణమి మహోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు బాలాజీ నగర్ శివారు ప్రాంతం పద్మావతి నగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిరంలో ఇటీవల సింహపురి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సాయిదర్బార్ ట్రస్ట్, సత్సంగ్ సేవాదళ్ సభ్యుల సహకారంతో సింహపురి ఆసుపత్రి వైద్యబృందం ఆధ్వర్యంలో 500మందికి పైగా ప్రజలకు వైద్యసేవలు అందించి మందులను పంపిణీ చేశారు. సింహపురి మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లు పవన్‌కుమార్ రెడ్డి, శ్రీలక్ష్మి, ఎంసిహెచ్ రెడ్డి, సాయిప్రణీత్ వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, సలహాలు ఇచ్చారు. బాబాకు ఉదయం, సాయంత్రం సహస్ర నామార్చనలు, సచ్చరిత్ర పారాయణం, పూలంగిసేవ, ఊంజల్ సేవలు నేత్రపర్వంగా సాగాయి. ఈ కార్యక్రమాన్ని మందిరం వ్యవస్థాపకులు మధుసాయి, భక్త మండలి సభ్యులు పర్యవేక్షించారు.

### పినాకిని ఛారిటీస్ ఆధ్వర్యంలో

## అబ్దుల్ కలాం వర్ధంతి



పినాకిని ఛారిటీస్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త భారతరత్న డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం ప్రథమ వర్ధంతి నెల్లూరు రామ్మూర్తి నగర్ ఎస్‌బిహెచ్ సెంటర్‌లోని డా॥ ఎపిజె అబ్దుల్ కలామ్ మెమోరియల్ గ్రంథాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు, పినాకిని ఛారిటీస్ అధ్యక్షులు ముక్కు రాధాకృష్ణ అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ అబ్దుల్ కలాం భారత రాష్ట్రపతి పదవి చేపట్టినా, భారత రత్న బిరుదు పొందినా గర్వపడకుండా నిరాడంబర జీవితాన్ని గడుపుతూ నిస్వార్థంగా దేశం యావత్తు పర్యటిస్తూ విద్యార్థి లోకానికి ప్రేరణనిచ్చి విద్యార్థుల మధ్యలోనే ప్రాణాలు వదిలిన మహామనిషని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గీత సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మారుబోయిన శ్రీనివాసులు గౌడ్, ఇన్‌ఛార్జ్ హెడ్‌మాస్టర్ సురేంద్ర, అబ్దుల్ కలాం గ్రంథాలయ కన్వీనర్ షేక్‌మాబు, బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు శాఖవరపు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆత్మ' పి.డిగా దొరసాని

వ్యవసాయ సాంకేతిక మాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బుధవారం ఎస్. దొరసాని బాధ్యతలను స్వీకరించారు. నెల్లూరులోని 'ఆత్మ' కార్యాలయంలో ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. చిత్తూరు ఆత్మ పి.డిగా పని చేస్తున్న ఆమెను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. గతంలో ఆమె ఇక్కడి వ్యవసాయ శాఖ రైతు శిక్షణా కేంద్రం ఏ.డిగా కూడా పనిచేశారు. జిల్లాలో సమీకృత వ్యవసాయ విధానాన్ని చేపట్టేలా రైతులకు తగు ప్రోత్సాహమిస్తామని ఆమె ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డిపిడి విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో అడిషనల్ డిజి

నెల్లూరుజిల్లా తడ సమీపంలోని శ్రీసిటీ సెజ్‌ను అడిషనల్ డిజి (లా అండ్ ఆర్డర్) ఆర్‌పి ఠాకూర్ బుధవారం సందర్శించారు. శ్రీసిటీలోని పరిశ్రమలు, మౌలిక సదుపాయాల గురించి ఆయన ఆరా తీసినట్లు సమాచారం.

## అభినందన సన్మానం

నెల్లూరు కస్తూరిదేవి బాలికల పాఠశాల గోడల తరహాలో నెల్లూరు సంతపేటలోని సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాల గోడలను సైతం స్ఫూర్తిదాయక చిత్రాలతో రూపొందించే కార్యక్రమాన్ని నేస్తం ఫౌండేషన్ చేపట్టింది. ఈ నేపథ్యంలో సెయింట్ జోసెఫ్ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ ఫ్రాన్‌లిస్టర్, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ రాజమ్మ, సెయింట్ జోసెఫ్ హాస్పిటల్ వైద్యురాలు డా॥ సిస్టర్ ట్రెసా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కోరెం ప్రవీణ్‌కుమార్, కో-ఆర్డినేటర్ కోరెం వెంకటేశ్వరరావు, చిత్రకారులు ముళ్ళపూడి మురళీకృష్ణలను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేస్తం ఫౌండేషన్ సభ్యులు గాలి శివ, వినోద్, సతీష్, సురేంద్ర, మురళీ, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



## మెదడును ఆరోగ్యంగా వుంచుకోవాలి

నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో వరల్డ్ బ్రెయిన్‌డే సందర్భంగా న్యూరాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ బిందుమీనన్ పార్కిన్‌సన్ డిసీజ్ సపోర్ట్ గ్రూప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎంహెచ్ఓ డాక్టర్ వరసుందరం పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా॥ బిందుమీనన్ మాట్లాడుతూ వృద్ధాప్య దశలో మెదడును ఎలా ఆరోగ్యంగా ఉంచుకోవాలి అన్నదానిపై నెలకు ఒకటి రెండు సార్లు సపోర్ట్ గ్రూప్ సమావేశమై వైద్యవిధానాలను గురించి చర్చించుకుని అవగాహన చేసుకోవాల్సి వుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా॥ శ్వేతారెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం - పరిశుభ్రత



నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామంలో ఈ నెల 27వ తేదీ నెల్లూరుజిల్లా యువజన సంక్షేమ శాఖ (సెట్నెల్) ఆధ్వర్యంలో సర్వేపల్లి సేవాసమితి యువజన సంఘం సహకారంతో పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాబా ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సిసి విద్యార్థులు, నెహ్రూ యువకేంద్రం, రెడ్‌క్రాస్, ఎన్‌జిఓ, యూత్ క్లబ్ వాలంటీర్లు పాల్గొని రోడ్డుకు ఇరువైపులా పాఠశాల ఆవరణంలో 200 చెట్లను నాటారు. 400 మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెట్నెల్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డా॥ సి.సుబ్రహ్మణ్యం, సిబ్బంది, ఎఆర్‌డిఎస్పీ శ్రీనివాసరావు, సిండికేట్ బ్యాంక్ మేనేజర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్యాబా, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా జగన్నాథ రథయాత్ర



గూడూరులో ఈ నెల 23న జగన్నాథ రథయాత్ర కన్నుల పండువగా జరిగింది. ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత గూడూరు డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాల్ వద్ద నుంచి రథయాత్ర ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ, ఇస్కాన్ టెంపుల్ వారి ద్వారా భక్తిశ్రద్ధలతో ఇక్కడ రథయాత్ర నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకునేందుకు ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. డిఎస్పీ శ్రీనివాస్ తదితరులు పాల్గొని రథయాత్రకు సహకరించిన దాతలను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు.

గూడూరు పట్టణంలోని పలువీధుల్లో రథయాత్ర నేత్రపర్వంగా సాగింది. చిన్నారులు ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, హనుమంతుడు, గోపికలు తదితర వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. కోలాటాలతో భక్తుల నృత్యాలు ఎంతో సందడిగా సాగాయి. భారీగా తరలివచ్చిన భక్తజనసందోహానికి గూడూరులోని వ్యాపారులు, పలు సంస్థలవారు పులిహోర, మంచినీటి ప్యాకెట్లు, మజ్జిగ, పొంగలి వగైరాలను పంపిణీ చేసి తమ భక్తిని చాటుకున్నారు. ఇస్కాన్ ఆలయ ప్రతినిధి శుకదేవస్వామి, బాదిపల్లి ఇందిర, లక్ష్మీ, పిఎం రావు, మునిసిపల్ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖరరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, పులిమి శ్రీనివాసులు, పి.శ్రీదేవి, వి.శివకుమార్, కోదండరామయ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు. సిఐ సుబ్బారావు, ఎస్‌ఐలు సుధాకర్, నరేష్ తదితరులు పాల్గొని రథయాత్రలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు నడిపించారు.

# రీ వెరిఫికేషన్‌లో శ్రీలేఖకు పదికి పది


శ్రీలేఖను అభినందిస్తున్న యం.వి.సుబ్బారెడ్డి, అధ్యాపక సిబ్బంది

నెల్లూరు నగరంలోని శ్రీ నేతాజీ(ఎంఎస్ఆర్) పైలట్ స్కూల్ విద్యార్థిని సి.హెచ్.శ్రీలేఖకు అన్ని సబ్జెక్టుల్లో 10కి 10 పాయింట్లు రాగా, ఇంగ్లీషులో మాత్రం 9 పాయింట్లు వచ్చాయి. ఆ విద్యార్థి రీ వెరిఫికేషన్ చేసుకోగా, ఇంగ్లీషులో 92మార్కులు వచ్చాయి. సగటున ఆమె 10/10 జిపిఏ సాధించినట్లు మార్కుల జాబితాను ప్రభుత్వం నుంచి అందుకుంది. ఈమేరకు పాఠశాల కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి మంగళవారం పాఠశాలలో విద్యార్థిని శ్రీలేఖను అభినందించి మాట్లాడుతూ వెరిఫికేషన్ చేసేటప్పుడు ఉపాధ్యాయులు ఇలాంటి పొరపాట్లు చేయకుండా వుంటే మెరిట్ విద్యార్థులు నష్టపోకుండా వుంటారని, మరొకసారి వెరిఫికేషన్ చేస్తూ వారికి సరైన ఫలితాలు అందేటట్లు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరేంద్రరెడ్డి, హెడ్‌మాస్టర్లు వి.సుధాకరరావు, ఎస్‌విఎల్ నరశింహారావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యాంటీ ర్యాగింగ్ పోస్టర్ ఆవిష్కరణ



యాంటి ర్యాగింగ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అనిల్, కాకాణి

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్‌యాదవ్‌లు యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ విద్యార్థులను మానసికంగా హింసిస్తూ ఇబ్బందులకు గురిచేస్తుంటే వారు అర్థాంతరంగా విద్యను నిలిపివేయడం, కొందరు ఆత్మహత్యలకు పాల్పడడం వంటివి జరుగుతున్నాయన్నారు. ర్యాగింగ్ అదుపునకు పోలీసులు కొంత కృషి చేస్తున్నప్పటికి పలు కళాశాలల్లో ఇంకా కనిపిస్తూనే వుందన్నారు. విద్యార్థులకు మానసికంగా వేధింపులు లేకుండా ప్రత్యేక చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జి.పి.శ్రావణ్‌కుమార్, హాజీ, అఖిల్, హరికృష్ణ, శివ, పెంచల నాయుడు, కమల్, వంశీ, నిఖిల్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కండక్టర్ నిజాయితీ

రోడ్డు మీద రూపాయి పడితే గుట్టు చప్పుడు కాకుండా నొక్కేసే ఈ రోజుల్లో భారీమొత్తంలో నగదు ఉన్న పర్సు దొరికితే నిజాయితీగా ఆర్టీసీ డిపోలో అప్పగించి తన నిజాయితీని నిరూపించుకున్నాడు ఆర్టీసీ కండక్టర్ నాగ శివకుమార్. వివరాల్లోకి వెళితే... నెల్లూరు నుంచి ఉదయగిరి వెళ్ళే ఎపి29 జడ్ 1987 పల్లె వెలుగు ఆర్టీసీ బస్సులో సోమవారం ఉదయం కండక్టర్ నాగశివకుమార్ విధులకెళ్లారు. డిపో నుంచి ఉదయం నెల్లూరుకు వెళ్లిన బస్సు తిరిగి ఉదయగిరి వస్తుండగా నెల్లూరుపాళెం వద్ద బస్సు వెనుకభాగం సీటులో ఉన్న పర్సును కండక్టర్ గుర్తించాడు. అందులో పరిశీలించగా రూ.24,500 నగదు, మూడు ఏటిఎం కార్డులు, ఇతర పత్రాలు ఉన్నాయి. కండక్టర్ నిజాయితీగా వ్యవహరించి బస్సులో దొరికిన పర్సును డిపోలో అప్పగించాడు. కండక్టర్ నిజాయితీని డిపో సిబ్బంది అభినందించారు. పర్సు పోగొట్టుకున్న వారిని గుర్తించి వారికి అందించేలా చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

# విజయాల పూత!

(మొదటి పేజీ తరువాయి)

పాత్రను పోషిస్తోంది. పరిపాలన అన్నాక మంచితో పాటు చెడు కూడా వుంటుంది. మంచిని మంచిగా ప్రచారం చేయడంలో తప్పులేదు. కాని చెడును కూడా మంచిగా ప్రచారం చేయడంలోనే తప్పుంది. అది ఈరోజు ప్రభుత్వాన్ని కాపాడొచ్చు కాని రేపు ఎన్నికలప్పుడు ఈ తప్పుల నుండి ఎవరూ కాపాడలేరు.

ఇక చంద్రబాబు సెల్ఫ్ సర్వేలు సైతం ఆయన పరిపాలనా వైఫల్యాల రోతకు విజయాలనే పూతను పూస్తున్నాయి. చంద్రబాబు చేయించుకుంటున్న సర్వేలు ఎలా ఉంటున్నాయంటే ఆయనే పరీక్ష వ్రాసి, ఆయనే పేపర్ దిద్దినట్లుగా వుంటున్నాయి. ప్రభుత్వంలో చంద్రబాబు పనితీరుకు మాత్రం నూటికి 80మార్కులు వస్తాయి. ఆయన మంత్రులకు, ఎమ్మెల్యేలకు మాత్రం నూటికి 30 నుండి 60 మార్కులు దాకా వస్తాయి. అలాగే ప్రభుత్వ పనితీరుకు ఎక్కువ మార్కులు తీసుకుంటారు. పార్టీ పనితీరుకు తక్కువ మార్కులు పడతాయి. ఇవి ప్రజలు వేసే మార్కులు మాత్రం కావు. వాళ్లకు వాళ్లు సొంతంగా వేసుకుని భుజాలు తట్టుకుని చప్పట్లు కొట్టుకోవడానికి వేసుకునే మార్కులు.

చంద్రబాబు పరిపాలన ఏ రూపంలో మెరుగ్గా వుందని 80 మార్కులు వచ్చాయో ఆయనకే తెలియాలి. ఈమధ్య పలు సర్వేలలో అవినీతిలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందని తేలింది. ఇందుకేమన్నా ఆయనకు మార్కులు వేసారేమో? ఈ దఫా అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో అవినీతి కట్టలు తెంచుకుంది. నిత్యావసర వస్తువుల ధరల కంటే వేగంగా లంచాల శాతం పెరిగింది. ప్రతి ప్రభుత్వ శాఖలోనూ అవినీతి వెర్రితలలు వేస్తోంది. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలే బహిరంగ అవినీతికి పాల్పడుతున్నారు. ఇక రాజధాని పేరుతో, సెజ్‌ల పేరుతో జరుగుతున్న భూదోపిడీకి అంతులేదు. స్వయంగా ముఖ్యమంత్రే వివిధ పేర్లతో చేస్తున్న దుబారాకు అంతు లేకుండా పోతోంది. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నీరుగారి పోతున్నాయి. పచ్చచొక్కాల వారినే ఎంపిక చేసి పథకాలు అందజేస్తున్నారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయడం లేదు. ప్రజలు కట్టిన పన్నులను ఏదో ఒక పేరు చెప్పి డ్రా చేస్తూ ఖజానాను ఎప్పటికప్పుడు ఖాళీ చేస్తున్నారు. చంద్రబాబు దేశాలు పట్టి తిరగడం తప్పితే, రాష్ట్రానికి వచ్చిన విదేశీ పెట్టుబడులేమీ లేవు. అమరావతి రాజధానిలో రైతుల నుండి దోచుకున్న భూములను సింగపూర్ కంపెనీలకు సలీసుగా ధారాదత్తం చేస్తున్నారు.

చంద్రబాబు పాలనపై రాష్ట్రంలోని ఏ వర్గానికి చెందిన ప్రజలు కూడా సంతృప్తిగా లేరు. ఆఖరకు సొంత పార్టీలోని కార్యకర్తలు సైతం తీవ్ర అసంతృప్తితో వున్నారు. ఇన్ని లోటుపాట్లను తన వెనుక పెట్టుకుని ఆయన మాత్రం తన పనితీరుకు డిస్టింక్షన్ మార్కులు వేసుకుంటుండడం వినడానికే కామెడీగా వుంది.

# వైకాపా పాలకులకు గండం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు అలాంటి ఓ ప్రక్రియకే చంద్రబాబు శ్రీకారం చుట్టబోతున్నాడని సమాచారం. స్థానిక సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధుల పదవీ కాలపరిమితిని రెండున్నరేళ్లకు మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని వినికిడి. కడప, నెల్లూరుజిల్లా పరిషత్ పీఠాలను లక్ష్యంగా చేసుకునే ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

2014కు ముందు మేయర్, మున్సిపల్ ఛైర్మెన్, జిల్లా పరిషత్ ఛైర్మెన్‌లను ఒకసారి ఎన్నిక చేశాక, రెండున్నరేళ్ల వరకు వాళ్లపై అవిశ్వాసం పెట్టడానికి గాని, వారిని అధికారం నుండి దించడానికి గాని అవకాశముండేది కాదు. రెండున్నరేళ్ళు గ్యారంటీ పిరియడ్ ఉండేది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ఆ కాలాన్ని నాలుగేళ్లకు పెంచారు. పూర్తి పదవీ కాలం ఐదేళ్లయినా, నాలుగేళ్ల వరకు వారి పదవులు గ్యారంటీ అన్నమాట! వాళ్లు రాజీనామా చేస్తేనో, లేక ఇతర కారణాల వల్లనో తప్పితే, వారికి మెజార్టీ తగ్గిందనో, అవిశ్వాస తీర్మానం ద్వారానో వారిని దించలేరు.


అయితే నెల్లూరు, కడప జిల్లాలు వైకాపా కంచుకోటలుగా వున్నాయి. ప్రకాశం, కర్నూలు జిల్లాలను అధికార బలంతో తెలుగుదేశం చేజిక్కించుకున్నా, నెల్లూరు, కడపలను మాత్రం వైకాపా నిలబెట్టుకోగలిగింది.

కాగా, ఇటీవలకాలంలో వైకాపా నుండి ఎమ్మెల్యేలతో పాటు జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా తెలుగుదేశంలోకి వెళ్లారు. దీంతో ఈ రెండు జిల్లా పరిషత్‌లలోనూ వైకాపా మైనార్టీలో పడింది. ప్రస్తుత జిఓ ప్రకారమైతే మెజార్టీ లేకున్నా వైకాపా జడ్పీ ఛైర్మెన్‌లను తొలగించలేరు. అందుకనే స్థానిక సంస్థల ప్రతినిధులపై అవిశ్వాస తీర్మానం పెట్టే కాలపరిమితిని నాలుగేళ్ల నుండి రెండున్నరేళ్లకు తగ్గించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ రూపొందించనున్నట్లు సమాచారం. ఆర్డినెన్స్ వస్తే ఒక్క నెల్లూరు, కడప జిల్లాల పరిషత్‌లలోనే కాదు, పలు కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలలో సైతం మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయి.

# పాలనలో రా'రాజు'

(మొదటి పేజీ తరువాయి)

తూర్పు గోదావరి జిల్లాల్లో జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. ఇప్పుడు విశాఖపట్నంలోని ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూటరీ కంపెనీ ఛైర్మెన్‌గా పనిచేస్తూ నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా వచ్చారు. శంకరన్ వంటి మహనీయుడు కలెక్టర్‌గా సేవలందించిన జిల్లా ఇది. ఈ జిల్లాలో ఆయన సేవా జ్ఞాపకాలు ఇంకా ఉన్నాయి. ఆయన వేసిన అభివృద్ధి పునాదులు ఇంకా కనిపిస్తున్నాయి. కలెక్టర్ ఒక పదవి పేరు కాదు, ఒక బాధ్యత. ఒక జిల్లాలో వున్న దాదాపు పాతిక లక్షల మంది ప్రజలకు సేవ చేసేందుకు భగవంతుడు కల్పించిన అపురూప అవకాశం. ఒక సర్పంచ్ ఒక గ్రామ పరిధిలో సేవ చేయగలడు, ఒక మేయర్ తన నగర పరిధిలోనే సేవలందించగలడు, కాని ఒక కలెక్టర్ జిల్లా మొత్తాన్ని మెప్పించేలా పని చేయగలడు. మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చి సామాన్యుల కష్టాలు ఎలా ఉంటాయో చవిచూసిన ముత్యాల రాజుకు పేదలు, సన్న, చిన్న జనం సమస్యలు ఎలా ఉంటాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కలెక్టర్‌గా నెల్లూరుజిల్లాలో పని చేయడం కూడా ఓ మంచి అవకాశం. ఇక్కడి నాయకులు, ప్రజల స్నేహ స్వభావం కలవాళ్ళు. అధికారులను ఇబ్బంది పెట్టే రకం కాదు. అధికారులు తమకు మంచి చేయాలని చూస్తే వారిని నెత్తిన పెట్టుకుంటారు. తమ మనసుల్లో నిలుపుకుంటారు. ఎక్కడ పని చేసినా నీతినిజాయితీలతో విధులు నిర్వహిస్తూ సమర్ధతకు ప్రతిరూపంగా నిలుస్తున్న ముత్యాలరాజుకు నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా రాణించడం పెద్ద సమస్యేమీ కాదు. ఈ జిల్లాలో పనిచేసిన ఓ మంచి కలెక్టర్‌గా ముత్యాలరాజు పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని, ఇక్కడ నుండి వెళ్లాక కూడా ఈ జిల్లా ప్రజలు ఆయనను గుర్తుంచుకునేలా విధి నిర్వహణ చూపాలని కోరుతూ... శుభాకాంక్షలు తెలుపుతోంది 'లాయర్'.


కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

శ్రద్ధాంజలి

మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాంతరాలలో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.
01-08-2016 సోమవారం ఆ మహనీయుని 39వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ

మనుమడు
మాగుంట విజయ్‌రెడ్డి

# సమన్వయంలో సరిగమలు

## ○ కార్యకర్తల్లో అసంతృప్తి బట్టబయలు



నెల్లూరుజిల్లా తెలుగుదేశం... పాత టీడీపీ, కొత్త కాంగ్రెస్, వైకాపా నాయకుల కలయిక! విభిన్నదారుల నుండి వచ్చిన నాయకులను ఒకే దారిలో నడపడం సాధ్యమా? నియోజకవర్గాల సమన్వయ కమిటీ సమావేశాల పేరుతో ఇలాంటి ప్రయత్నమే చేసారు నెల్లూరుజిల్లా తెలుగుదేశం నాయకులు.

జిల్లాలోని 10అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కమిటి సమావేశాలు 27, 28 తేదీలలో నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగాయి. 27వ తేదీ నెల్లూరు నగరం, రూరల్, సర్వేపల్లి, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల సమావేశాలు నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్ధా రాఘవరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, పరిశీలకుడిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసింహయాదవ్ పాల్గొన్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిపై చర్చించారు. నెల్లూరు నగరంలో నాయకులు నాలుగు గ్రూపులుగా తయారై తన్నుకుంటున్న విషయాన్ని చర్చించారు. నగరంలో పార్టీ పరిస్థితి మెరుగు కావాలని ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్ధా రాఘవరావు సూచించడం జరిగింది. నెల్లూరురూరల్‌లో పార్టీ పుంజుకోలేదని, అభివృద్ధి కార్యక్రమాలతో అక్కడ వేగం పెంచాలని ఆదాలకు సలహా ఇచ్చారు. వెంకటగిరిలోని పలు మండలాల్లో పార్టీ బలహీనపడిన విషయాన్ని లేవనెత్తారు. ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాకపోయినా ద్వితీయ శ్రేణి నాయకులు సర్వేపల్లి సమీక్షకు హాజరయ్యారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పార్టీలోకి తీసుకుంటున్నారన్న ప్రచారంపై సర్వేపల్లి కార్యకర్తలు నాయకులను నిలదీశారు. గూడూరు నియోజకవర్గంలోనూ పార్టీ నాయకులు నాలుగు స్థంభాలాట ఆడుతున్నారు. వీరందరూ కలిసి పనిచేయాలంటూ సలహా ఒకటిచ్చారు.

28వ తేదీ కోవూరు, ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల సమావేశాలు జరిగాయి. ఆయా నియోజకవర్గాలలో లోటుపాట్లను చర్చించారు. ముఖ్యంగా నాయకులు నామినేటెడ్ పదవుల విషయాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇతర పార్టీల నుండి వచ్చిన వాళ్లకు పదవులలో పెద్దపీట వేస్తూ ఏళ్ల తరబడి తెలుగుదేశం జెండాలను మోసిన కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్నారన్న బాధ ఈ సమావేశాలలో ప్రస్ఫుటమైంది.



### మూడురోజులు...

# నెల్లూరులోనే జగన్



జగన్ పర్యటన వివరాలను వెల్లడిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆగష్టు 1, 2, 3తేదీలలో నెల్లూరులో ఉండబోతున్నాడు. 1, 2తేదీలలో మినీబైపాస్ రోడ్డులోని అనిల్ గార్డెన్స్‌లో జిల్లాలోని 10అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలు నిర్వహించనున్నారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితి, సంస్థాగత నిర్మాణం, స్థానిక సమస్యలు, పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయా నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో చర్చించనున్నారు. అలాగే 3వ తేదీ కెవిఆర్ పెట్రోల్‌బంక్ సెంటర్‌లోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ప్రత్యేకహోదా సాధనలో భాగంగా జరిగే యువభేరి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తారు. జగన్ పర్యటనను జయప్రదం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

### కృష్ణపట్నం పోర్టులో...

# రాష్ట్రంలోనే తొలి గోల్ఫ్‌కోర్ట్!





కృష్ణపట్నం పోర్టు... నెల్లూరు జిల్లా అభివృద్ధికి వేదిక. జిల్లా ప్రజలకు కానుక. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ఈ జిల్లా అభివృద్ధికి చేసిన సపోర్ట్... ఈ పోర్టు! ఇదే గనుక లేకుంటే జిల్లాలో వ్యవసాయం, ఆక్వా, చిన్న వ్యాపారాలు తప్పితే పారిశ్రామిక ప్రగతే ఉండేది కాదు. దక్షిణాసియాలోనే శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కృష్ణపట్నం పోర్టు దేశీయంగానే కాదు, విదేశాల నుండి వచ్చే పారిశ్రామికవేత్తలు, అధికారులు, ఉద్యోగులకు అనుగుణంగా మౌలిక వసతులను సమకూర్చుకుంటోంది. ఈ పరంపరలోనే రాష్ట్రంలోనే తొలి గోల్ఫ్ కోర్టును పోర్టు ప్రాంగణంలో రూపొందించింది. ఇది బీచ్ గోల్ఫ్‌కోర్ట్. సముద్ర తీరంలో దాదాపు 20 ఎకరాల స్థలంలో ఇప్పటికి 10కోట్ల ఖర్చుతో ఈ గోల్ఫ్ కోర్టును నిర్మించారు. ఈ నెల 25వ తేదీన కేంద్రమంత్రులు యం.వెంకయ్యనాయుడు, సురేష్ ప్రభులు ఈ గోల్ఫ్ కోర్ట్‌ను ప్రారంభించారు. గోల్ఫ్ కోర్టులను రూపొందించడంలో విశేష అనుభవం వున్న ఇంగ్లాండ్‌కు చెందిన నిపుణులు ఈ గోల్ఫ్ కోర్ట్‌ను తీర్చిదిద్దారు. ముఖ్యంగా జపాన్ పారిశ్రామికవేత్తలను దృష్టిలో పెట్టుకుని పోర్టు యాజమాన్యం దీనిని ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. జపాన్‌కు చెందిన అనేక కంపెనీలు కృష్ణపట్నం సెజ్‌లో తమ పరిశ్రమలను స్థాపించేందుకు ఆసక్తి చూపుతున్నాయి. భారతదేశంలో పెట్టుబడులకు కృష్ణపట్నం సెజ్ అనువైనదిగా వారు భావిస్తున్నారు.

దేశంలోని మిగతా పోర్టులతో పోలిస్తే కృష్ణపట్నం పోర్టు నుండి జపాన్‌కు ప్రయాణ సమయం ఒకరోజు తగ్గుతుంది. జపాన్ వాళ్లు ఒక్క నిముషం కాలాన్ని కూడా వృధా చేయరు. కాబట్టే కృష్ణపట్నంకు వాళ్ళు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. జపాన్ కంపెనీలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడంతో పాటు, ఇక్కడే వారికి ప్రత్యేక కాలనీ కూడా ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జపనీస్ ఇష్టంగా ఆడేది గోల్ఫ్‌కోర్ట్. ప్రత్యేకంగా వారి కోసమే పోర్టులో ఈ గోల్ఫ్‌కోర్స్‌ను నిర్మించినట్లు తెలుస్తోంది.

# కోలుకుంటున్న ఆటో వంశీ

## స్పందించిన మానవత్వం... ఫలించిన కోటంరెడ్డి ప్రయత్నం




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చివరికి జీవచ్ఛవంలా మారిన హెచ్‌కె బాబునగర్ నివాసి ఆటో డ్రైవర్ వంశీకి ఎట్టకేలకు వైద్యులు శస్త్ర చికిత్సను పూర్తిచేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆ మేరకు వివరాలు తెలియజేస్తూ, సింహపురి ఆసుపత్రి వైద్యులతో సంప్రదించగా వంశీకి చికిత్స పూర్తయిందని తెలిపారన్నారు. గత మూడు నెలలుగా వంశీ కోసం తపించినవారందరికీ ఇదెంతో సంతోషకరమైన సమాచారమని అంటూ, అందరి శ్రమ ఫలించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నిధి నుంచి కూడా 7 లక్షల సాయం అందడంతో బుధవారం వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో వంశీ కుటుంబంలో ఆనందానికి అవధులు లేవు. వంశీ తిరిగి కోలుకునేందుకు సాయం చేసిన వారందరికీ, ప్రత్యేకించి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికీ ఈ సందర్భంగా వంశీ భార్య కృతజ్ఞతలు తెలియజేసింది. వంశీ ఈరోజు కోలుకుని రేపు సాధారణ జీవితంలోకి అడుగుపెట్టబోతున్నాడంటే ఆ ఖ్యాతి అంతా కూడా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికే దక్కుతుంది. ఎందుకంటే... ప్రమాదంలో గాయపడి, మంచానికే పరిమితమైన వంశీని ఈ లోకంలోకి తెచ్చింది, అతని గురించి ఈ సమాజానికి తెలియజెప్పింది, అతనికి సాయపడేలా పదిమందిని ముందుకు కదిలించింది కోటంరెడ్డే! అతను వేసిన తొలిఅడుగే రేపు వంశీ చేత మళ్ళీ అడుగులు వేయించబోతోంది. హ్యాట్సాఫ్... కోటంరెడ్డి!

# రైతన్నల సేవకు పెద్దపీట

## - డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు



జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా రైతన్నలకు మరింత మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తున్నామని డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరులోని డిసిసిబి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన బ్యాంక్ మహాజన సభలో ఆయన మాట్లాడుతూ 2015-16లో 68 సంఘాల ద్వారా 43,060 మెట్రిక్ టన్నుల ఎరువులు, 42 సంఘాలతో విత్తనాలను సరఫరా చేశామని, 60 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి 212 కోట్ల మేరకు ధాన్యాన్ని సేకరించామని తెలిపారు. 2016-17 నాటికి రుణ లక్ష్యం 630 కోట్లు కాగా, గత ఏడాది 49288.56 లక్షలు రుణాలుగా ఇచ్చామన్నారు. ఈ ఏడాది 250కోట్లు డిపాజిట్లుగా లక్ష్యం నిర్ణయించామని, మార్చి నెలాఖరుకు బ్యాంకు 329.80 లక్షలు లాభాన్ని ఆర్జించిందని వివరించారు. రైతులకు స్వల్పకాలిక పంట రుణాలతో పాటు ట్రాక్టర్లు, పండ్లతోటల పెంపకానికి, సామాజిక వనరుల అభివృద్ధికి, గొర్రెలు, గేదెల కొనుగోలుకు దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేస్తున్నామన్నారు. సొసైటీల ద్వారా ఎరువులు, విత్తనాల క్రయ విక్రయాలు, ధాన్యం కొనుగోళ్ళ వల్ల లాభాలు గడిస్తున్నామన్నారు. వ్యక్తిగత ప్రమాద బీమా, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలను బ్యాంక్ ద్వారా అమలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డిసిసిబి బ్యాంక్ వైస్ ఛైర్మెన్ నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సిఇఓ రాజారెడ్డి, రమేష్‌బాబు, విజయభాస్కర రెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com